


# అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

16.09.2026
బుధవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 77
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## రూ.2000 యూపీఐ పేమెంట్‌పై చార్జీలు

- అక్టోబర్ 15 నుంచి కొత్త నిబంధన
- మర్చంట్ డిస్కౌంట్ రేట్ రుసుము
- నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయం
- 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని వెల్లడి



5లో..

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

భారత్‌లో విస్తృతంగా ఉపయోగిస్తున్న డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐ వినియోగదారులకు కేంద్రం నుంచి బిగ్ న్యూస్ వచ్చింది. చిన్న తరహా చెల్లింపులు, వ్యక్తిగత నగదు బదిలీలపై ఎలాంటి రుసుములు విధించబోమని స్పష్టం చేసింది. అయితే వ్యాపారులకు సంబంధించి రూ.2,000 కంటే ఎక్కువ విలువైన పెద్ద లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ రుసుమును విధించే అంశంపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. వ్యాపారులకు వ్యక్తులు రూ.2000 కంటే ఎక్కువ యూపీఐ పేమెంట్స్ చేస్తే.. ఆ చెల్లింపులపై 0.4 శాతం ఛార్జీ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. అంటే రూ.2000 లోపు పేమెంట్స్ ఎండీఆర్ పరిధిలోకి రావు.

## శ్రీవారికి చంద్రబాబు పట్టువస్త్రాలు

- ధ్వజారోహణంతో వైభవంగా
- శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం

5లో..



## ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు రండి

- ఫ్యూచర్ సిటీపై ఆగా ఖాన్ ఆసక్తి
- ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌తో సీఎం రేవంత్ భేటీ
- మూసీ పునరుజ్జీవనంపై చర్చ
- హైదరాబాద్ వారసత్వ పరిరక్షణకు సహకారం
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి పునరుద్ధరణకు విజ్ఞప్తి
- ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులపై సీఎంతో చర్చ
- తెలంగాణలో పెట్టుబడులు, పర్యాటకంపై సహకారానికి పిలుపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

**భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-V హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి వారితో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ, హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.**

తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసన మండలి భవనాన్ని పునరుద్ధరించడం, అలాగే నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై సిద్ధం చేసిన ప్రణాళికలను ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది వెంట నైట్ ఎకానమీ కార్యకలాపాల దిశగా తీర్చిదిద్దుతున్న విషయాలను తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని కోరారు.

ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు వివరించారు.

డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ Vని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రిన్స్ ఆగా ఖాన్ V ఆసక్తిని కనబరిచి దాని ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 నిమిషాల దూరంలో నిర్మించే ఫ్యూచర్ సిటీ పూర్తిగా నెట్ జీరో సిటీగా ఉండబోతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

2లో..



## హైడ్రా, తెలంగాణ సర్కార్‌కు సుప్రీంలో షాక్

- ఆ 40 ఎకరాలు శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్‌దేనని తీర్పు
- హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ..


2లో..

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్**

హైదరాబాద్ నగరంలో గత కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వానికి, శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు మధ్య జరుగుతున్న భూ వివాదంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఆ 40 ఎకరాల్లో ఉన్న నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేయడంతో.. ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ.. హైకోర్టును ఆశ్రయించగా.. ఆ సంస్థకు అనుకూలంగా తీర్పు రాగా.. దాన్ని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

## ట్రంప్ మా గ్యారెంటీ స్కీమ్స్‌ను కాపీ కొడుతున్నారు

- కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్
- సంక్షేమ పథకాలు బ్లాక్‌బస్టర్ అయ్యాయి
- గ్యారెంటీ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయి


2లో..

## మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని మృతి

- గుండెపోటుతో నివాసంలోనే హఠాన్మరణం
- 2024 ఎన్నికల తర్వాత రాజకీయాలకు దూరంగా
- టీడీపీలో చేరినా.. ప్రత్యక్ష రాజకీయాల్లో ఇన్ యాక్టివ్
- ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఆళ్ల నాని

2లో..



## అన్ని రాష్ట్రాలూ వందేమాతర గేయాన్ని పాడాల్సిందే..

- కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా
- భారతీయ భాషలను ప్రోత్సహించడానికి..
- రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలి

2లో..

**ముంబై, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్**

ముంబయిలో జరిగిన 6వ అఖిల భారత రాజభాషా సమ్మేళనంలో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా .. జాతీయ గేయం 'వందేమాతరం' ఆలాపనపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. 'వందేమాతరం' పూర్తి వైభవ పునరుద్ధరణకు దాదాపు 80 ఏళ్లు పట్టిందని ఆయన వ్యాఖ్యానించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఈ గేయం ఎంతో కీలక పాత్ర పోషించిందని అన్నారు.

## నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలి

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్
- జెన్ జీ, జెన్ ఆల్ఫాకు రిక్వెస్ట్

2లో..



## సీఎం రేవంత్‌రెడ్డితో నాకు గొడవల్లేవ్

### పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

టీపీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ.. బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు. కుల సర్వేతో తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం జరిగిందన్నారు. కుల సర్వేను కేంద్రం తొక్కి పెట్టడం దురదృష్టకరమని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు.


5లో..

## మోస్ట్ వాంటెడ్ మహిళా మావోయిస్టు లొంగుబాటు

### మహిళా అగ్రనేత నక్కా సుశీల అలియాస్ రేలా



2లో..

## తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త

- ఏపీకి 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్ల కేటాయింపు
- సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు
- కేంద్రం భారీ శుభవార్త చెప్పింది
- కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటన

2లో..

# నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలి

చెన్నై, సెప్టెంబర్ 15,

అనంతజనశక్తి న్యూస్




జెన్‌జీ , జెన్ ఆల్ఫా తరాలకు చెందిన యువత కూడా నాయకత్వ బాధ్యతలు స్వీకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆశయాలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని.. వారు ముందుకు రావాలని కోరారు. దేశం మనకు ఏం చేసిందని అనుకోకుండా.. దేశం కోసం మనమేం చేశామో ప్రశ్నించుకోవాలని సూచించారు. తమిళనాడు లోని డాక్టర్ ఎం.జి.ఆర్. ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు.

'మిమ్మల్ని మీరు జెన్‌జీ, జెన్ ఆల్ఫా అని పిలుచుకున్నా సరే.. మీరు చెప్పేది వినడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. కానీ మీ చుట్టూ ఏం జరుగుతోంది? అందులో మీ పాత్ర ఏమిటి?, మీరు దేశం కోసం ఏం సాధించవచ్చు? అనే విషయాల గురించి తప్పక ఆలోచించాలి. దేశ ప్రయోజనాల విషయంలో ఎప్పుడూ రాజీ పడకూడదు. దేశం సురక్షితంగా, బలంగా ఉంటేనే మనం నివసించడానికి ఒక ఇల్లు ఉంటుంది. పలు ప్రపంచ దేశాల్లో యుద్ధాలు, ఘర్షణల కారణంగా పౌరులు నిర్వాసితులుగా మారుతున్న పరిస్థితులను మనం చూస్తున్నాం. కానీ మనకు ఆ పరిస్థితి లేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం , పశ్చిమాసియాలో ఘర్షణలు వంటి అనిశ్చితుల వల్ల ప్రపంచ దేశాల్లో ముడి చమురు, గ్యాస్, ఎరువుల సరఫరాపై ప్రభావం పడుతోంది. అయినప్పటికీ భారత్ అన్ని పరిస్థితులను ఎదుర్కొని.. 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలోని బలమైన ప్రభుత్వమే ఈ స్థిరత్వానికి కారణం. యువత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది. జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్నది సాధించగలం' అని నిర్మలా సీతారామన్ విద్యార్థులకు సూచించారు.

# మోస్ట్ వాంటెడ్ మహిళా మావోయిస్టు లొంగుబాటు



నిజామాబాద్, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల లొంగుబాట్ల పరంపర కొనసాగుతోంది. తాజాగా మావోయిస్టు నక్కా సుశీల అలియాస్ లత, లలిత, రేలా, జ్యోతి పోలీసుల ఎదుట లొంగిపోయారు. మంగళవారం నిజామాబాద్ ఎస్పీ సాయి చైతన్య ఎదుట ఆమె లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ డివిజన్ కమాండెంట్ మెంబర్ (డీసీఎం)గా ప్రస్తుతం సుశీల బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఆమె లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ దాదాపుగా తుడిచి పెట్టుకు పోయిందన్నారు. తెలంగాణకు చెందిన ముగ్గురు అగ్రనేతలు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని ఎస్పీ వివరించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాలో సోమవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. నరసరావుపేటలోని అదనపు ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ సమక్షంలో మావోయిస్టులు కందర్ప దుర్గా ప్రసాద్, గొడ్డళ్ల లచ్చమ్మ లొంగిపోయారు. కందర్ప దుర్గా ప్రసాద్ స్వస్థలం విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం, లచ్చమ్మ స్వస్థలం పల్నాడు జిల్లాలో వెల్దుర్తి మండలం శ్రీరాంపురం తండా అని ఏఎస్పీ ఈ సందర్భంగా వివరించారు. వీరిద్దరు అర్బన్ డెన్ కీపర్లుగా పని చేశారని తెలిపారు.

దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్రం ఆపరేషన్ కగార్ నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లొంగిపోయి.. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కేంద్రం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో భారీగా మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మరణించిన సంగతి తెలిసిందే.

# ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు రండి

(మొదటి పేజీ తరువాయి)

సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని, ఇందులో దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని గుర్తుచేస్తూ 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు.

ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు సమావేశంలో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ Vకి వివరించారు.

హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో అగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తుచేస్తూ భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని కోరారు.

ఈ సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఉన్నతాధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# హైడ్రా, తెలంగాణ సర్కార్‌కు సుప్రీంలో షాక్





(మొదటి పేజీ తరువాయి)

అయితే తాజాగా ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అనుకూలంగా, తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించింది. ఆ 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థదేనని తేల్చి చెప్పింది.

సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ ఏరియాలో లోతుకుంట ప్రాంతంలో ఉన్న 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీదే అని సుప్రీంకోర్టు తాజాగా వెల్లడించింది. ఈ క్రమంలోనే ఆ 40 ఎకరాల భూమి తమదే అంటూ

తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ దీపంకర్ దత్త నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. అయితే ఆ వివాదాస్పద 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీదే అని గతంలోనే తెలంగాణ హైకోర్టు తీర్పును ఇచ్చింది.

హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. అది ప్రభుత్వ భూమి అంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే.. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ఏకంగా 219 రోజుల ఆలస్యంగా దాఖలు చేశారనే కారణంతో జస్టిస్ దీపంకర్ దత్త ధర్మాసనం.. దాన్ని డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో సరైన సమయంలో తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడంలో విఫలం కావడంతో ఆ పిటిషన్‌ను విచారణకు తీసుకోలేమని స్పష్టం చేసింది. దీంతో తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించినట్లు అయింది. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ ప్రాంతంలోని 40 ఎకరాల వివాదాస్పద భూమి ప్రైవేటుదేనని తేల్చి చెప్పింది. అయితే.. ఇదే 40 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఉల్లంఘించి.. శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ భూమిలో హైడ్రా అధికారులు కూల్చివేతలకు పాల్పడటంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. తాము ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా ఎలా

కూల్చివేతలు జరుపుతారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని.. ఆయన స్థానంలో సమర్థవంతమైన అధికారిని నియమించాలంటూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ధర్మాసనం ఆదేశాలు కూడా జారీ చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కార చర్యలు కూడా తీసుకోవాలని

హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే ఇచ్చింది.

# అన్ని రాష్ట్రాలూ వందేమాతర గేయాన్ని పాడాల్సిందే..



(మొదటి పేజీ తరువాయి)

భారతీయ సాంస్కృతిక చైతన్యం, జాతీయ అస్తిత్వంతో ఇది ఎంతగానో ముడిపడి ఉందని అమిత్ షా పేర్కొన్నారు. వందేమాతర గేయాన్ని అన్ని రాష్ట్రాలూ ఆలపించాల్సిందేనని ఈ సందర్భంగా షా పునరుద్ఘాటించారు.

భారతీయ భాషల ప్రోత్సాహాన్ని సాంస్కృతిక జాతీయ వాదంతో ముడిపెట్టిన అమిత్ షా... మన సంస్కృతి, ఘన చరిత్రల గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. భాషా వైవిధ్యాన్ని భిన్నత్వంగా కాకుండా.. దేశ ఐక్యతకు మూలమైన గొప్ప బలంగా చూడాలని కేంద్ర హోం మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన జాతీయ విద్యా విధానం ప్రాముఖ్యతను వివరించిన షా.. దీనిపై చేస్తోన్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. విద్యార్థులు తమ మాతృభాషతో పాటు మరొక భారతీయ భాషను నేర్చుకోవాలని ప్రోత్సహించే నిబంధనను సమర్థించిన ఆయన.. దీనిని వ్యతిరేకించేవారు పెద్ద పాపం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ భాషలను ప్రోత్సహించే విషయంలో రాజకీయ విభేదాలను పక్కనబెట్టాలని సూచించారు.

నూతన జాతీయ విద్యా విధానం ఉద్దేశం ఏ ఒక్క నిర్దిష్ట భాషనూ బలవంతంగా రుద్దడం కాదన్నారు. భారతీయులంతా ప్రాంతీయ భాషలు, సంస్కృతుల పట్ల పరస్పర అవగాహన, ఆప్యాయతలను పెంచుకోవడానికేనని ఆయన వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నూతన విద్యా విధానం ద్వారా ప్రాథమిక దశలో మాతృభాషలోనే బోధనను తప్పనిసరి చేసిందని ఆయన గుర్తుచేశారు. ఇక, మహారాష్ట్రలోని భాషా వైవిధ్యంపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. దేశంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన బహుళ భాషా ప్రాంతంగా ఆయన అభివర్ణించారు. కొంకణి, గుజరాతీ, సింధీ, హిందీ, కన్నడ, వార్లీ వంటి పలు భాషలు ఏకకాలంలో వర్ధిల్లాయని, సముచిత స్థానాన్ని పొందాయని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. మహారాష్ట్ర కంటే దేశంలో పెద్ద బహుభాషా ప్రాంతం మరొకటి లేదని కితాబిచ్చారు. మరాఠీకున్న ప్రాచీన సాహిత్య, చారిత్రక వారసత్వాన్ని గుర్తించి, 'ప్రాచీన భాష' హోదాను కల్పించేందుకు ప్రధాని మోదీనే స్వయంగా చొరవ తీసుకున్నారని ఆయన గుర్తుచేశారు. భారతీయ భాషలను విద్య, పరిపాలన, ప్రజా జీవనంలో మరింతగా విస్తరించి.. తద్వారా భాషలు, చరిత్ర, జాతీయ అస్తిత్వం మధ్య ఉన్న సాంస్కృతిక సంబంధాన్ని మరింత బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అమిత్ షా వివరించారు.

# తెలుగు రాష్ట్రాలకు కేంద్రం శుభవార్త



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

దేశవ్యాప్తంగా పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. అందులో 5 లక్షల ఇళ్లను తెలుగు రాష్ట్రాలకు కేటాయించినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో తెలుగు రాష్ట్రాలకు ఈ స్థాయిలో ఇళ్ల కేటాయింపు జరగడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. 2024లో కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన కేటాయింపులతో పోలిస్తే ఏపీకి అదనంగా 2.25 లక్షలు.. తెలంగాణకు మరో 1.25 లక్షల ఇళ్లు మంజూరైనట్లు వివరించారు. ఇళ్ల కేటాయింపుపై కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కోరిందని.. ఆ రాష్ట్రం అడిగిన దానికంటే ఎక్కువగానే ఇళ్లు మంజూరు చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు.

20192024 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 1.78 లక్షల ఇళ్లు కేటాయించగా.. వాటిలో సుమారు 42 వేల ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తి అయిందని కేంద్రమంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఇప్పుడు కొత్తగా మంజూరైన ఇళ్లతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. వచ్చే 2, 3 సంవత్సరాల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఒక్కో ఇంటి నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.1.20 లక్షల ప్రాథమిక ఆర్థిక సాయం అందుతుందని కేంద్రమంత్రి పెమ్మసాని తెలిపారు. ఇతర పథకాల ద్వారా లభించే అదనపు ప్రయోజనాలను కలుపుకుంటే లబ్ధిదారులకు మొత్తం సాయం సుమారు రూ.1.70 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు చేరుతుందని వివరించారు. అలాగే స్వచ్ఛ భారత్ అభియాన్ కింద మరుగుదొడ్డి నిర్మాణానికి అదనంగా రూ.12 వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. దీంతో పేద కుటుంబాలకు ఇల్లు నిర్మించుకోవడంలో మరింత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ప్రయోజనాలు మరింత మంది పేదలకు అందేలా కేంద్ర ప్రభుత్వం అర్హత నిబంధనల్లో కొన్ని మార్పులు చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కుటుంబ నెలసరి ఆదాయ పరిమితిని గతంలో ఉన్న రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచినట్లు చెప్పారు. అంతేకాకుండా ఇంట్లో బైక్, ఫ్రిజ్ వంటి సాధారణ వస్తువులు ఉన్నంత మాత్రాన పథకానికి అనర్హులుగా పరిగణించకుండా నిబంధనలను సవరించినట్లు వివరించారు. ఈ మార్పులతో మరింత మంది అర్హులైన పేద కుటుంబాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పరిధిలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆవాస్ ప్లస్ యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా లబ్ధిదారుల వివరాలను నమోదు చేయడంతో పాటు.. ప్రజల సౌకర్యం కోసం సెల్ఫ్ సర్వే సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావు ఉండదని.. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇళ్లు కేటాయించేలా ప్రక్రియ కొనసాగుతుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణలో గతంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల కేటాయింపులు జరగలేదని కేంద్రమంత్రి పెమ్మసాని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఇళ్ల కేటాయింపుపై కేంద్రాన్ని పలుమార్లు కోరారని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు తాజాగా 2 లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోని పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారం చేసుకునే అవకాశం ఏర్పడనుంది.

# మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని మృతి

అమరావతి, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్



కాళీకృష్ణ శ్రీనివాస్ అలియాస్ ఆళ్ల నాని ఇకలేరు. గుండెపోటుతో ఆయన మృతి చెందారు. విశాఖ సీతమ్మధార ప్రాంతంలోని తన ఇంట్లోనే ఆళ్ల నాని గుండెపోటుకు గురై కుప్పకూలారు. కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి.. ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినా ఆయన అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. 57 ఏళ్ల ఆళ్ల నాని.. ఏలూరు నుంచి 3 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004, 2009, 2019 ఎన్నికల్లో ఆయన గెలిచారు. 2017లో ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆళ్ల నానికి ఇద్దరు కుమారులు ఉండగా.. ఒకరు యూఎస్, మరొకరు యూకేలో ఉంటున్నారు.

మొదట కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆళ్ల నాని.. 2004, 2009 ఎన్నికల్లో విజయం సాధించారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట నడిచారు. అనంతరం 2019 ఎన్నికల్లో మరోసారి గెలిచి.. వైఎస్ జగన్ కేబినెట్‌లో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. కరోనా మహమ్మారి సమయంలో వైద్యారోగ్య శాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేశారు.

ఏలూరు నియోజకవర్గం నుంచి 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆళ్ల నాని.. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ తరపున గెలిచి డిప్యూటీ సీఎం అయ్యారు.

2014 ఎన్నికల్లో ఏలూరు నుంచి వైసీపీ తరపున పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి పాలైన తర్వాత.. ఆళ్ల నాని వైసీపీ నుంచి దూరంగా ఉన్నారు. ఆ తర్వాత గతేడాది ఫిబ్రవరిలో టీడీపీలో చేరారు.

ఆళ్ల నాని స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు. ఆళ్ల సూర్యచంద్రరావు, నాగమణి దంపతులకు 1969 డిసెంబర్ 30వ తేదీన ఆళ్ల నాని పుట్టారు. ఆయన ఏలూరులోని కేపీ హైస్కూల్‌లో 1985లో పదో తరగతి పూర్తి చేశారు. 1988లో సర్. సీఆర్ కాలేజీ ఇంటర్మీడియట్ చదివారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీలో బీఏలో చేరిన ఆళ్ల నాని చదువును మధ్యలోనే ఆపేశారు.

ఈఈ క్రమంలోనే కాలేజీ సమయంలోనే రాజకీయాల్లోకి అడుగు పెట్టి ఆళ్ల నాని.. యూత్ కాంగ్రెస్ నేతగా పనిచేశారు. 1994, 1999లో కాంగ్రెస్ పార్టీ తరపున ఏలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2004లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థి అంబికా కృష్ణపై 33 వేలకు పైగా ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఆ తర్వాత జరిగిన 2009 ఎన్నికల్లోనూ మళ్లీ కాంగ్రెస్ పార్టీ తరపున మరోసారి ఎమ్మెల్యే అయ్యారు. అటు 2013లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరిన ఆళ్ల నాని.. 2014 ఎన్నికల్లో ఏలూరు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఏలూరు నుంచి విజయం సాధించారు. 2024 ఆగస్ట్ 17వ తేదీన వైసీపీ జిల్లా అధ్యక్ష పదవితోపాటు.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ తర్వాత కొన్నిరోజులు రాజకీయాలకు దూరంగా ఉన్న ఆళ్ల నాని.. 2025 ఫిబ్రవరి 13వ తేదీన తెలుగుదేశం పార్టీలో చేరారు.

# ట్రంప్ మా గ్యారెంటీ స్కీమ్స్‌ను కాపీ కొడుతున్నారు

బెంగళూరు, సెప్టెంబర్ 15, అనంతజనశక్తి న్యూస్

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ పొందాయని సీఎం పేర్కొన్నారు. ఇప్పుడు ట్రంప్ కూడా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 'బ్లాక్‌బస్టర్' అయ్యాయని శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో మంగళవారం డీకే శివకుమార్ మాట్లాడుతూ.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని అన్నారు. ఇదే సమయంలో అమెరికా రాజకీయాల్లో ట్రంప్ తాజాగా చేసిన ఓ హామీని ఆయన ప్రస్తావించారు. నవంబర్‌లో జరిగే మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు ప్రతినిధుల సభ, సెనెట్‌పై ఆధిపత్యాన్ని కొనసాగిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' అందిస్తామని ట్రంప్ ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ హామీలను ఆయన కాపీ కొడుతున్నారని శివకుమార్ చెప్పుకొచ్చారు. కాగా, ఐర్లాండ్‌లో గత ఆదివారం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి వయోజనుడికి 5,000 డాలర్లు ఇవ్వడం సాధ్యమేనని చెప్పారు. అమెరికా ప్రభుత్వం భారీ మొత్తంలో ఆదాయం సమీకరిస్తోందని, అందువల్ల ఈ డబ్బు చెల్లింపు పెద్ద సమస్య కాదని అన్నారు. గతంలో డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావేశంలో ట్రంప్ తొలిసారి ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలోకి భారీగా ఆదాయం వస్తోందని, దీంతో ప్రజలకు 5,000 డాలర్లు చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ డీకే శివకుమార్ పైవిధంగా స్పందించారు.**



# మహిళా బైకర్‌ను వెంటాడి.. కారుతో ఢీకొట్టి..!



తనను వెంబడిస్తున్న వారిని వారించినందుకు కొందరు వ్యక్తులు ఓ మహిళా బైకర్‌ను కారుతో ఢీకొట్టారు. ఈ ఘటన గురుగ్రామ్)లోని గోల్ఫ్ కోర్స్ రోడ్డుపై చోటుచేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గురుగ్రామ్‌కు చెందిన సియా స్పోర్ట్స్ బైక్ నడుపుతుండగా కొందరు వ్యక్తులు కారులో ఆమెను వెంబడించారు. ఇది గమనించిన ఆమె తన వెంట పడొద్దని వారిని వారించింది. కొంత దూరం వెళ్లాక వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను బలంగా తాకుతూ వెళ్లింది. దీంతో సియా రోడ్డుపై పడిపోగా.. బైక్ కొంత దూరం మేర జారుతూ వెళ్లిపోయింది. ఈ ఘటన సియా బైక్‌పై అమర్చిన యాక్షన్ కెమెరాలో రికార్డ్ అయింది.

అదే సమయంలో సియా వెనుక వస్తున్న ఆమె స్నేహితులు కారును ఆపడానికి ప్రయత్నించారు. కాగా, కారులోని వ్యక్తి వారితో దుర్భాషలాడుతూ వేగంగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ వీడియోను సియా సోషల్ మీడియాలో షేర్‌చేయడంతో వైరల్‌గా మారింది. దూరంగా వెళ్లమన్నందుకు కారులోని వ్యక్తులు ఈ విధంగా ప్రవర్తించారని.. ఆ సమయంలో వారంతా మద్యం మత్తులో ఉన్నారని తెలిపారు. రోడ్డుపై వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గురుగ్రామ్ పోలీసులను కోరారు.

**కావాలనే కారుతో ఢీకొట్టాడు..**


**మహిళా బైకర్ ఆరోపణలు..!**

గురుగ్రామ్ లో మహిళా బైకర్ సియాను కారు ఢీకొట్టిన ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. బైక్‌పై వెళ్తోన్న సియాను ఓ కారు వెంబడించి ఢీకొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. కారు నడిపిన కల్యాణ్ బైస్లా అనే వ్యక్తి తనపై వచ్చిన ఆరోపణలను ఖండించాడు. సియా బైక్‌పై గంటకు 140 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో వెళ్తోందని.. తాను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టలేదని చెప్పాడు. కేవలం సోషల్ మీడియాలో వ్యూస్, ఫాలోవర్లు, పబ్లిసిటీ కోసమే ఆమె ఈ ఘటనను పెద్దది చేస్తోందని వాదించాడు.

ఈ వాదనను సియా తీవ్రంగా ఖండించింది. అనుకోకుండా ప్రమాదం జరిగితే.. కారు ఎందుకు ఆపలేదని కల్యాణ్ బైస్లాను ఆమె ప్రశ్నించారు. మహిళా బైకర్‌ను కావడంతో అతడు ఉద్దేశపూర్వకంగానే ఢీకొట్టాడని ఆరోపించారు. కారు ఢీకొట్టిన తర్వాత కనీసం తాను సురక్షితంగా ఉన్నానా లేదా అని చూసే ప్రయత్నం కూడా చేయలేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోల్లో తన బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోవడం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. ఈ మేరకు సియా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్టు చేశారు. నిందితుడు క్రిమినల్ మైండ్‌సెట్‌తోనే ఈ పని చేశాడని, మీడియా ముందు సాకులు చెప్తున్నాడని సియా కుటుంబసభ్యులు మండిపడ్డారు.

నిందితుడి అరెస్టు...

పరారీలో ఉన్న కల్యాణ్ బైస్లాను గురుగ్రామ్ పోలీసులు రాజస్థాన్‌లోని దౌసా లో అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తదుపరి విచారణ కోసం గురుగ్రామ్‌కు తరలిస్తున్నారు. అతడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# ఆ కుటుంబంలో ఐదుగురు తోబుట్టువులకు.. నీట్‌లో సీట్లు



చదువుకోవాలనే తపన, సాధించాలనే సంకల్పం ఉండాలే గానీ.. ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించారీ తోబుట్టువులు. కడు పేదరికం, అరకొర వసతులు ఇబ్బంది పెట్టినా.. వాటిని దాటుకుని ప్రాణం పోసే వైద్య వృత్తి వైపు అడుగులు వేశారు. ఒకరి తర్వాత ఒకరు నీట్‌లో ఉత్తీర్ణత సాధించి వైద్య విద్యలో ప్రవేశం పొందారు. ఓ నిరుపేద ఆదివాసీ రైతు కుటుంబంలో పుట్టిన ఐదుగురు అన్నాచెల్లెళ్ల కథ ఇది..!

ఒడిశా లోని కంధమాల్ జిల్లా సికాబడి గ్రామానికి చెందిన బృషినాయక్, అనుశాయ దంపతులది నిరుపేద కుటుంబం. ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తుంటారు. కొన్నిసార్లు కుటుంబాన్ని పోషించేందుకు బృషి నాయక్ వలసకూలీగా ఇతర రాష్ట్రాల్లో పనిచేశారు. అతడు చదువుకోలేదు, కానీ చదువు ఎంత ముఖ్యమో అర్థం చేసుకున్నారు. అందుకే, ఎంత కష్టమైనా సరే పిల్లలను చదివిస్తున్నారు.

అన్న స్ఫూర్తితో..

తండ్రి బృషినాయక్ కష్టం చూసిన కుమారుడు బిబీశన్ మంచిగా చదువుకుని నీట్‌లో ఉత్తీర్ణత సాధించాడు. కొరాపుట్‌లోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అతడు.. ప్రస్తుతం అక్కడే ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. బిబీశన్ స్ఫూర్తితో పెద్ద చెల్లెలు మోనాలిసా కూడా నీట్‌లో అర్హత సాధించి.. ఇదే మెడికల్ కాలేజీలో వైద్య విద్య రెండో సంవత్సరం చదువుతోంది. ఆ తర్వాత మరో ముగ్గురు చెల్లెల్లు సునేమీ, ఆశ్రియా, మీనాక్షి కూడా ఈ ఏడాది నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ప్రభుత్వ రంగ వైద్య కళాశాలల్లో ప్రవేశం పొందారు. ఇందులో మీనాక్షి.. బృషి తమ్ముడు జిశియా కుమార్తె. కానీ కొన్ని కారణాల రీత్యా చిన్నతనం నుంచి ఆమెను బృషి దంపతులే పెంచుతున్నారు. ''వీళ్లంతా నా పిల్లలే. మా ఇంట్లో మొత్తం 9 మంది ఉంటాం. మరో ఇద్దరు కుమారులు స్కూల్లో చదువుతున్నారు. మా పిల్లలు ఏం కోర్సులు చేస్తున్నారో నాకు తెలియదు. కానీ, వారంతా జీవితాల్లో స్థిరపడి సమాజానికి ఎంతో కొంత మేలు చేస్తే అంతకంటే ఆనందం ఏముంటుంది'' అని వీరి తల్లి అనుశాయ ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువుల కోసం ఇప్పటికే కొంత రుణం తీసుకున్నామని, అయితే వైద్య విద్య చాలా ఖర్చుతో కూడుకున్నది కావడంతో ప్రభుత్వం తమకు అండగా నిలవాలని బృషి నాయక్ కోరుతున్నారు.

# చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్ ఇస్తాం..

**- అంగీకరించిన మెటా**

సామాజిక మాధ్యమాల్లో పిల్లల భద్రతకు సంబంధించిన అంశంలో ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్‌కు సంబంధించి నేరుగా భారత దర్యాప్తు సంస్థలకు రిపోర్ట్ చేసేందుకు అంగీకరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఆన్‌లైన్ వేదికల్లో పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోన్న కేంద్ర ప్రభుత్వం.. ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

''చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసుల వివరాలు, ఇతరత్రా కంటెంట్‌ను దర్యాప్తు సంస్థలకు ఇచ్చేందుకు మెటా అంగీకరించింది. పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని కల్పించే దిశగా ఇది తొలి అడుగు మాత్రమే. ఇంకా చేయాల్సింది చాలా ఉంది'' అని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ సందర్భంగా స్పష్టం చేశాయి. సామాజిక మాధ్యమాల్లో హానికర కంటెంట్ నుంచి మైనర్లను రక్షించాల్సిన బాధ్యత సదరు ప్లాట్‌ఫామ్‌లదే అని కేంద్రం పునరుద్ఘాటించింది. దీన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఈ హానికర కంటెంట్‌ను కట్టడి చేసే విషయమై సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లతో కేంద్రం నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. అలాంటి కంటెంట్‌ను గుర్తించి, సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా చర్యలు చేపట్టినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలాంటి కంటెంట్ విషయంలో భారత్‌లోని మెటా ప్రతినిధులకు కేంద్రం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మెటా ఉపయోగిస్తోన్న అల్గారిథమ్స్, కంటెంట్ నియంత్రణ వ్యవస్థలు, డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టే ప్రక్రియలు, భారత చట్టాలకు అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి అధికారులు వివరాలు అడిగారు. ఈ నేపథ్యంలోనే మెటా తాజా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇప్పటివరకు చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ గురించి అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్' (ఎన్‌సీఎంఈసీ)కు మెటా నివేదిక ఇచ్చేది. ఆ సమాచారాన్ని ఎన్‌సీఎంఈసీ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దర్యాప్తు సంస్థలతో పంచుకునేది. అలా భారత దర్యాప్తు సంస్థలకు వివరాలు అందేవి. అయితే, ఇకపై ఇలాంటి సంస్థల ప్రమేయం లేకుండా.. నేరుగా మెటానే భారత దర్యాప్తు ఏజెన్సీలకు వివరాలను రిపోర్ట్ చేయనుంది.



# దొంగదారిలో భారత్‌కు.. 362 మెట్రిక్ టన్నుల పాక్ ఎండు ఖర్జూరా



పాకిస్థాన్ నుంచి అక్రమంగా ఎండు ఖర్జూరాలు భారత్‌కు తరలిస్తున్న

**ముఠాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. పాక్ నుంచి దిగుమతులపై నిషేధం ఉన్నప్పటికీ.. ఆ దేశానికి చెందిన 362 మెట్రిక్ టన్నులకు పైగా ఎండు ఖర్జూరాలను నాసిక్‌కు చేర్చినట్లు నిఘా వర్గాలు డీఆర్ఐ అధికారులకు సమాచారం ఇచ్చాయి. దీంతో నాసిక్‌లోని అంబాడ్ కంటైనర్ ఫ్రైట్ స్టేషన్ వద్ద ముంబయికి చెందిన ఓ సంస్థ దిగుమతి చేసుకున్న 13 కంటైనర్ల ఎండు ఖర్జూరాలను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని యూఏఈ నుంచి దిగుమతి చేసుకున్నట్లు సదరు సంస్థ పేర్కొంది.**

**అయితే ఈ ఖర్జూరాలు పాక్ నుంచి తీసుకువచ్చినట్లు అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.**

**అనుమానం రాకుండా ఉండేందుకు ఎండు ఖర్జూరాలను తొలుత కరాచీ పోర్టు నుంచి... యూఏఈలోని జెబెల్ అలీ పోర్టుకు తరలించారని అధికారులు పేర్కొన్నారు. అనంతరం వాటిని మరో నౌకలోకి లోడ్ చేసి నకిలీ పత్రాలు సృష్టించి, భారత్‌కు తరలించినట్లు తెలిపారు. సదరు కంపెనీపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.**

**పహల్గాంలో గతేడాది జరిగిన ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ నుంచి వచ్చే అన్ని రకాల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఇకపై ఇరుదేశాల మధ్య ఎటువంటి వాణిజ్య సంబంధాలు ఉండబోవని స్పష్టం చేసింది. నాటి నుంచి పాకిస్థాన్ నుంచి దిగుమతి అయ్యే అన్ని మార్గాల్లో 'ఆపరేషన్ డీప్ మ్యానిఫెస్ట్' పేరిట డీఆర్ఐ తనిఖీలు నిర్వహిస్తోంది.**

## విలాసాలు 'హౌస్'ఫుల్

బిహార్‌లోని ముజఫర్‌పుర్‌లోని ఓ ఇంట్లోకి ఏకంగా కారుతోనే వెళ్లొచ్చు. రెండు, మూడు అంతస్తుల వరకు వెళ్లి బెడ్‌రూమ్‌లోనే పార్క్ చేయొచ్చు. అంత ప్రత్యేకం గనకే స్థానికులు ఆ బంగళాని 'అమెరికన్ హౌస్', 'డాలర్ విల్లా' అని పిలుస్తుంటారు. అమెరికాలో స్థిరపడ్డ అజయ్‌సింగ్ తనకు నచ్చినట్టుగా నిర్మించుకున్నారు. ప్రధాన ఆకర్షణ.. ప్రత్యేకంగా నిర్మించిన ర్యాంప్‌నే. దాని ద్వారా వాహనాల్ని రూఫ్‌టాప్ వరకు తీసుకెళ్లొచ్చు. అంతేనా.. స్విమ్మింగ్‌పూల్, ఫౌంటెన్, విశాలమైన గార్డెన్, హైడ్రాలిక్ లిఫ్ట్, సెంట్రలైజ్డ్ ఏసీ వంటి సౌకర్యాలతో విలాసంగా ఉంటుందా భవంతి. మాస్టర్ బెడ్‌రూమ్ నుంచి మెయిన్ గేట్ కనిపించేలా డిజైన్ చేయడం, లివింగ్ రూమ్‌లో నడుస్తున్న సినిమాను బెడ్‌రూమ్‌లోనూ చూసేలా స్క్రీన్ ఏర్పాటు చేయడం ఈ ఇంటి మరో ప్రత్యేకత. ప్రస్తుతం రూ.35 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండటంతో మరోసారి వార్తల్లోకి వచ్చింది.



## వరదల వేళ.. బోటునే బడిగా మార్చి..



బిహార్ లో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక గ్రామాలు నీటమునిగాయి. భారీ వరదల నేపథ్యంలో విద్యార్థులు స్కూళ్లకు రావడం మానేశారు. దీంతో కతిహార్ జిల్లాలోని రఘునాథ్‌పుర్‌కు చెందిన ఉపాధ్యాయుడు మహమ్మద్ సాహెబ్ వినూత్న ఆలోచన చేశారు. ఓ బోటునే స్కూల్ గా మార్చేశారు. తల్లిదండ్రుల అనుమతితో వరద ప్రభావిత ప్రాంతాల విద్యార్థులను ప్రతిరోజూ నీటి మట్టం తక్కువ ఉన్న ప్రాంతానికి బోటులోనే తీసుకువెళ్లి, అందులోనే పాఠాలు చెబుతున్నారు. చదువు పూర్తయిన అనంతరం మళ్లీ వారిని తిరిగి తమ ఇళ్ల వద్ద వదిలి వెళ్తున్నారు. రోజువారీ తరగతి పాఠాలతో పాటు మహమ్మద్ సాహెబ్ విద్యార్థులకు పడవలోనే వివిధ కోచింగ్ క్లాస్‌లు కూడా నిర్వహిస్తుండటం విశేషం. మన చుట్టూ ఉన్న పరిస్థితులు చదువుకు ఆటంకం కలిగించొద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఒకేసారి ఎక్కువ మంది విద్యార్థులు కాకుండా విడతల వారీగా బోటులో పాఠాలు బోధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## విజయ్ థీమ్‌తో వినాయకుడు.. భగ్గుమన్న విపక్షాలు



దేశవ్యాప్తంగా గణేశ్ చతుర్థి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే చీఫ్ విజయ్ రూపాన్ని ప్రతిబింబించేలా కొన్ని వినాయకుడి విగ్రహాలు దర్శనమిచ్చాయి. చెన్నైలో వాటిని ఏర్పాటు చేశారు. ఆ ఫొటోలు వైరల్ కావడంతో విపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశాయి .

''లక్షలాదిమంది ప్రజలు పూజించే దైవస్వరూపాన్ని రాజకీయ ప్రచారం కోసం ఈ విధంగా మార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ వైఖరి ప్రజల ఆధ్యాత్మిక భావాలను తక్కువ చేయడమే అవుతుంది. మతపరమైన వేడుకలను తన కార్యకర్తలు ఎన్నికల ప్రచార సాధనాలుగా ఉయోగిస్తున్నా టీవీకే చూస్తూ ఉంది'' అని భాజపా తమిళనాడు అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తీవ్ర విమర్శలు చేశారు. ఇలాంటి ఘటనలపై విజయ్ మౌనాన్ని ప్రశ్నించారు. వెంటనే ఆ విగ్రహాలను తొలగించాలని, నిర్వాహకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వాటిని తొలగించాలని సంబంధిత వ్యక్తులను ఇప్పటికే ఆదేశించినట్లు టీవీకే వర్గాలు వెల్లడించాయి. విజయ్ అభిమానులు ఎనిమిదేళ్లుగా ఆ తరహాలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని సమాచారం.

## ట్రంప్ మా హామీలను కాపీ చేస్తున్నారు: డీకే శివకుమార్



కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను సమర్థిస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ గ్యారంటీలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా కాపీ చేస్తున్నారని పేర్కొన్నారు. అవి బ్లాక్ బస్టర్ అయ్యాయంటూ మీడియాతో మాట్లాడారు. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీని గెలిపిస్తే.. ప్రతి వయోజన అమెరికన్‌కు 5000 డాలర్లు ఇస్తామని ఇటీవల ట్రంప్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

''మా హామీలను మహారాష్ట్ర కాపీ చేసింది. రాజస్థాన్, బిహార్ అదే పనిచేశాయి. ఇప్పుడు ట్రంప్ మా బాటలోనే నడుస్తున్నారు. ఎన్నికల్లో గెలిస్తే 5వేల డాలర్లు ఇస్తానని ప్రకటించారు. మన ఆలోచనా విధానం భారత్‌కే పరిమితం కాకుండా ప్రపంచానికి పరిచయం అవుతోంది. ఇదే కాంగ్రెస్ పార్టీ బలం'' అని శివకుమార్ పేర్కొన్నారు.

అమెరికా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని.. దేశం సాధించిన విజయాల్లో ప్రజలకు వాటా కల్పించడం కోసమే 5000 డాలర్లు ఇస్తామని ట్రంప్ చెప్పిన సంగతి తెలిసిందే. దానిని డివిడెండ్‌గా పేర్కొన్నారు. ఈ ఆకస్మిక వాగ్దానం అమలుకు లక్ష కోట్ల డాలర్లకు పైగా ఖర్చు కావచ్చని తెలుస్తోంది.

## సముద్రం అడ్డుపడి ఉండకపోతే.. అరబ్ దేశాల్లో పోటీ చేసేవారేమో!



దేశ రాజధాని నగరమైన దిల్లీలో పోటీ చేసే సత్తా లేని నెహ్రూ గాంధీ కుటుంబికులు ఉత్తర్ ప్రదేశ్ దాటి వయనాడ్‌దాకా వెళ్లారని.. మధ్యలో సముద్రం అడ్డుగా లేకపోతే అరబ్ దేశాల్లోనూ వారు పోటీ చేసేవారేమోనని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన 'లాడ్లీ బెహెన్' నిధుల బదిలీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'పప్పు'గా పేరొందిన రాహుల్ గాంధీ కొత్త సాంకేతికతతో పురోగమిస్తున్న భారత్ ప్రగతిని అంగీకరించకపోవడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఈ నెల 19న ఇండోర్‌లో రాహుల్ పాల్గొననున్న 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తోందన్నారు. యువత గురించి మాట్లాడే మిషతో అబద్ధాల పరంపర ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో చాలా ఏళ్లు రాష్ట్రాన్ని పాలించినా బందిపోట్లను, నక్సలైట్లను అరికట్టడంలో విఫలమైనందుకు ప్రజలను క్షమాపణ కోరాక రాహుల్ మధ్యప్రదేశ్‌కు రావాలని మోహన్ యాదవ్ డిమాండు చేశారు.




# ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)

ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ దేశవ్యాప్తంగా అమలైనప్పుడు చట్టబద్ధమైన ఓటర్ల సంఖ్యకు సంభవించే మొత్తం నష్టానికి సంబంధించి మా తొలి అంచనాలపై చాలామంది ప్రతిస్పందన అది. ఒక సత్యాన్ని తెలుసుకున్నామన్న ఆశ్చర్యకరమైన భావన కొంతమంది స్పందనలో ధ్వనించగా మరి కొంతమంది ఆ ఏక పద ప్రశ్న రూప స్పందనలో మా అంచనాల పట్ల వ్యంగ్యాన్ని ధ్వనింపజేశారు. ఇదలా ఉంచి అసలు విషయానికి వద్దాం. బిహార్‌లో ఓటర్ జాబితాల నుంచి 65 లక్షల పేర్ల తొలగింపునకు సర్ దారితీసింది. ఆ ప్రకారం చూస్తే, దేశవ్యాప్తంగా దాదాపు పది కోట్ల మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకు సర్ దారితీస్తుందని మేము అంచనా వేశాం. అయితే ఎవరూ మా మాటను విశ్వసించలేదు. అప్పటికీ మేము చేసిన హెచ్చరికల వల్లే బిహార్‌లో అంతిమ తొలగింపుల సంఖ్య చెప్పుకోదగిన స్థాయిలో తగ్గింది. సర్ అమలులో అసంగతాలపై మేము దేశ ప్రజలను అప్రమత్తం చేస్తూ వస్తున్నాము. ఇప్పుడు తుది గణాంకాలు వచ్చేశాయి. మొత్తం తొలగింపులు మేము ఊహించిన దానికంటే అత్యధికంగా ఉన్నాయి. దీనిపై మనం సత్వరమే మేల్కొనకపోతే మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

ప్రధాన రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా సర్ ఓటర్ జాబితాల విడుదలను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గతవారం పూర్తి చేసింది. నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల ముసాయిదా ఓటర్ జాబితాలను ఇంకా విడుదల చేయవలసి ఉన్నది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ–కశ్మీర్ రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అమలు ఇంకా ప్రారంభం కాలేదు. అయినప్పటికీ దేశవ్యాప్త సర్ ఫలితాల ధోరణి స్పష్టంగా ఉంది. ముసాయిదా స్థాయిలో జరిగిన తొలగింపుల సంఖ్య 13 కోట్ల 37 లక్షలుగా ఉన్నది. ముసాయిదా జాబితాల విడుదల తరువాత మరికొంత మందిని జాబితాలలో చేర్చడం లేదా తొలగించడం సహజం కనుక సర్ అంతిమ జాబితాలలో తొలగింపుల సంఖ్య కొంచెం తక్కువగా ఉండవచ్చు. అదనపు చేర్పులు, సర్ ఇంకా ప్రారంభం కాని రాష్ట్రాలనూ పరిగణనలోకి తీసుకున్నప్పుడు భారత్ ఓటర్ జాబితాల నుంచి అంతిమ తొలగింపులు పన్నెండు కోట్లకు పైగా ఉండవచ్చనేది మా అంచనా.

ఈ విషయాన్ని మరింత లోతుగా, విశాలంగా చూద్దాం. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో భారతదేశ ఓటర్ల సంఖ్య 98 కోట్లుగా ఉన్నది. అదే కాలంలో వయోజనుల సంఖ్య (99 కోట్లు)కు ఓటర్ల సంఖ్య ఇంచుమించు సమానంగా ఉన్నది. సర్ లాంఛనంగా ముగిసే నాటికి భారతదేశ వయోజన జనాభా అంచనా 103 కోట్లుగా ఉంటుంది, అంతిమ జాబితాలలోని ఓటర్ల సంఖ్య 88 కోట్లకు తగ్గిపోతుంది. వయోజన జనాభాకు, ఓటర్ల సంఖ్యకు మధ్య ఇంత పెద్ద వ్యత్యాసానికి కారణమేమిటో నిశితంగా చూడవలసిన అవసరమున్నది. ఆ భారీ వ్యత్యాసం రెండు అవకాశాలను సూచిస్తుంది: ఒకటి– బహుశా జనాభా అంచనా భారీగా వేసి ఉండాలి. అంటే అధికారిక అంచనాలలో ఉన్నట్లుగా 145 కోట్లకు పైగా కాకుండా భారత జనాభా 125 కోట్ల లోపే ఉండి ఉండాలి. రెండు– ఓటు వేసే వయసుగల 15 కోట్ల మంది యువత ఓటర్ జాబితాల నుంచి గల్లంతవడం. వీటిలో ఏది నిజం? ఏది నిజమైనప్పటికీ ఆ 'వాస్తవం' అక్షరాలా ఒక లజ్జాకర విషయమని చెప్పక తప్పదు.

సర్ ప్రక్రియలో తొలగింపులు అన్నీ తప్పుడువేనని భావించనవసరం లేదు. ప్రస్తుత ఓటర్ జాబితాలలో లొసుగులు, నకిలీ పేర్లు చాలా ఉన్నాయి. కనుక తొలగింపులలో అత్యధిక భాగం న్యాయబద్ధమైనవేనని అంగీకరించాలి. అయినప్పటికీ మూడోవంతు తొలగింపులు సక్రమమైనవి కాకపోయినా ఓటర్ జాబితాలు తారుమారు కావడమనేది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాని స్థాయిలో జరిగిందనే వాస్తవాన్ని మనం గుర్తించాలి.

ఓటు హక్కు ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల దాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేనివారు, అసలు ఓటు హక్కు అందుబాటులోకి రానివారిని కూడా పరిగణనలోకి తీసుకోవల్సివుంది. సర్‌కు పూర్వపు జాబితాలలో లేని అర్హులైన ఓటర్లు కోట్ల సంఖ్యలో ఉన్నారు. వారిలో చాలామంది పేర్లను సర్ ప్రారంభం కాకముందే జాబితాల నుంచి తొలగించారు. ఈ అవకతవకలన్నిటినీ సర్ సరిదిద్దలేదు. దీన్నిబట్టి వయోజన జనాభా సంఖ్యకు, ఓటర్ల సంఖ్యకు మధ్య భారీ వ్యత్యాసం ఎందుకు ఉన్నదో అర్థమవుతుంది.

మరి ఆ వ్యత్యాసం సర్ తదుపరి దశలలో క్రమేణా తగ్గిందా? లేదు. లేకపోగా ప్రతి దశలోనూ ఓటర్ తొలగింపుల విస్తృతి, స్వభావం మరింత ప్రతికూల మార్పులకు లోనయ్యాయి. 'సర్'ను తొట్ట తొలుత బిహార్‌లో అమలుపరిచారు. అది తొలి మార్గదర్శక దశ. బిహార్‌కే పరిమితమైన ఆ దశలో ఓటర్ జాబితాల నుంచి తొలుత 65 లక్షల పేర్లను తొలగించారు. అయితే న్యాయవ్యవస్థ జోక్యంతో ఆ తొలగింపులు అంతిమంగా 45 లక్షలకు తగ్గిపోయాయి. బిహార్ తరువాత 13 రాష్ట్రాలలో సర్ రెండో దశ ప్రారంభమయ్యే నాటికే ఆ ప్రక్రియ పట్ల ప్రజలు ఉదాసీనత వహించారు. రాజకీయ పక్షాలు ఉపేక్షాభావం చూపాయి. అప్పటికే బిహార్ ఎన్నికలు జరిగిపోయినందున ప్రజలు 'సర్'కు అలవాటుపడ్డారు. ఓటర్ల సంఖ్యలో దాదాపు 13శాతం తగ్గుదలను చాలావరకు ఎవరూ ప్రశ్నించలేదు. అయితే పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం ఓటర్ల తొలగింపు మీద మాత్రం జాతీయ స్థాయిలో పౌరసమాజం దృష్టి పెట్టింది. సర్ అమలు తీరుతెన్నులపై సంపూర్ణ నిర్ణయాధికారం ఎన్నికల సంఘానిదేనని సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసింది. దీంతో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియను తాను నిర్ణయించుకున్న రీతిలో అమలుపరిచింది. మూడో దశ ముసాయిదా సర్ జాబితాలలో ఓటర్ల తొలగింపులు 17శాతానికి పైగా పెరిగాయి!

సర్ మూడో దశ అమలైన హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణతో పాటు ఢిల్లీలో ఓటర్ల తొలగింపులు అసాధారణంగా అత్యధిక సంఖ్యలో చోటుచేసుకున్నాయి. మూడు దశలలోను 'మృతుల' కేటగిరీలోని ఓటర్ల నిష్పత్తి స్థిరంగా ఉన్నది. మొత్తం తొలగింపులలో 'మృతుల' తొలగింపులు ఇంచుమించు 3శాతంగా ఉన్నాయి. ఇవి కాకుండా 'అందుబాటులో లేకపోవడం' (అబ్సెంట్), 'వలస వెళ్లడం' (షిఫ్టెడ్) కారణాలతో కూడా పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించారు. గమనార్హమైన విషయమేమిటంటే అబ్సెంట్, షిఫ్టెడ్ కేటగిరీలను ఇప్పటివరకు స్పష్టంగా నిర్వచించలేదు. దీంతో స్థానిక ఎన్నికల అధికారులు తమకు తోచిన విధంగా ఆ కేటగిరీలను ఉపయోగించారు. ముసాయిదా ఓటర్ జాబితాల నుంచి తొలగింపునకు గురైనవారే కాకుండా అదనంగా మరో అయిదోవంతు మంది ఓటర్లు 'అన్ మ్యాప్డ్' (జాబితాలో చేర్చని) లేదా 'లాజికల్ డిస్క్రిపెన్సీ' (తార్కిక వ్యత్యాసం) కారణాల వల్ల మరింత పరిశీలనను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒడిషా, జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల్లో 'తార్కిక వ్యత్యాసం' నిష్పత్తి అసాధారణంగా హెచ్చుస్థాయిలో ఉన్నది. కారణమేమిటి? కంప్యూటర్ అల్గారిథమ్ కంటే మరేదో పెద్ద కారణం ఉందని చెప్పక తప్పదు. అటువంటి వ్యత్యాసాలను ఎలా పరిష్కరించాలనే దానికి సంబంధించి ఎలాంటి ప్రామాణిక కార్యాచరణ విధానం కూడా లేదు. నిష్కర్షగా చెప్పాలంటే 'లాజికల్ డిస్క్రిపెన్సీ' అనేది ఒక పద్ధతి కాదనేది స్పష్టం. ఉద్దేశపూర్వకంగా రూపొందించిన, అనుసరిస్తున్న ఒక ఏకపక్ష వైఖరి.

సర్ మూడో దశలో ఒక కొత్త దురాచారం ఆరంభమయింది: చాలా రాష్ట్రాలలో సర్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కాకముందే ఓటర్ జాబితాల నుంచి పెద్ద ఎత్తున తొలగింపులు జరిగాయి. వీరు మళ్లీ ఓటర్‌గా నమోదయ్యేందుకు వీలుగా కనీసం ఒక ఎన్యూమరేషన్ ఫామ్‌ను సైతం అందుకోలేదు. వారి తొలగింపులు చాలా అనామకంగా జరిగిపోయాయి. 'ఇవి సర్ తొలగింపుల కిందకు రావు' అనేది గమనార్హమైన వాస్తవం. సర్ మూడో దశకు షెడ్యూలు ప్రకటించిన మే 12, సర్ అధికారికంగా ప్రారంభమైన రోజుకు మధ్య 14 లక్షల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించారు. వీటిలో అత్యధిక భాగం –8 లక్షలు– మహారాష్ట్రలో జరిగాయి.





# భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి

## వినియోగం ఎక్కువ, అవగాహన తక్కువ

**ఆంధ్రప్రదేశ్లో ని అధికశాతం నీటి సమస్యలు భూగర్భ జలాలకు సంబంధించినవే. ప్రపంచంలోనే అత్యధికంగా భూగర్భ జలాలను వెలికితీసే దేశం మనదే. సంవత్సరానికి 260 క్యూబిక్ కిలోమీటర్లకు పైగా నీరు తోడుతూ, ప్రపంచవ్యాప్తంగా వెలికితీసే మొత్తం భూగర్భ జలాల్లో 25 శాతాన్ని మనం వినియోగిస్తున్నాం. అమెరికా, చైనాలను కూడా అధిగమించాం. వ్యవసాయంలో 70 శాతం నీటి సరఫరా భూగర్భ జలాల నుంచే వస్తోంది. రాబోయే సంవత్సరాల్లో కూడా ఇదే జీవనాధారంగా నిలుస్తుంది. అయినా భూగర్భ జలాలపై మన అవగాహన చాలా తక్కువ. ఇది విధానాలను, ఆచరణను రెండింటినీ ప్రభావితం చేస్తోంది. కంటికి కనిపించని నీరు... మనసులో ఉండదు. భూగర్భ జలాలు కంటికి కనిపించవు. భూమి లోతున ఉండటం వల్ల అవి మనసులోకి రావు. అంతేకాకుండా అవి అత్యంత సంక్లిష్టమైనవి. వినియోగదారులు, ప్రభుత్వ అధికారుల్లో ఉన్న అజ్ఞానమే నేటి దుస్థితికి దోహదం చేస్తోంది.భూగర్భ జల విద్య ఇప్పటికీ కొత్త వనరులను 'అన్వేషించడం', 'అభివృద్ధి' చేయడంపైనే దృష్టి సారిస్తోంది. బావులు మరింత లోతుగా వెళ్తున్నా,**



డా. ముచ్చుకోట సురేష్‌బాబు,
9989988912



జలాశయాల నిర్వహణను సంక్లిష్టంగా చూస్తున్నాం. సరఫరా-డిమాండ్ మధ్య అంతరం పెరుగుతోంది. ఆక్విఫర్‌ల లక్షణాలు, వాటి వినియోగం గురించి స్పష్టమైన అవగాహన లేకపోవడం వల్ల నిర్ణయాధికారులు, వినియోగదారులు సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారు.అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ వాటర్ రిసోర్సెస్ అండ్ డెవలప్‌మెంట్ నిపుణుల ప్రకారం, వివిధ వర్గాలకు వేర్వేరు భాష, బోధనా పద్ధతులు అవసరం. జలభూ విజ్ఞాన శాస్త్రవేత్తలకు ఒక రకం, సామాన్య ప్రజలకు మరో రకం, నిర్ణయాధికారులకు మరో రకం. సమస్యను స్పష్టంగా వివరించి తెలియజేసే సామర్థ్యమే భూగర్భ జల నిర్వహణకు కీలకం.ప్రాథమికంగా మూడు సమస్యలు ఉన్నాయి. మొదటిది క్షీణత. మన బావులు, ఊటలు ఎండిపోతున్నాయి. ఈ క్షీణత ఫలితంగా భూగర్భ జలాల నాణ్యత కూడా క్షీణిస్తోంది. రెండవది కాలుష్యం. ఫ్లోరైడ్, ఆర్సెనిక్ వంటి తీవ్రమైన కాలుష్య సమస్యలు ఇప్పుడు కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా దేశంలోని విస్తార ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. ఇవి తరచుగా జలాశయాల క్షీణతతో ముడిపడి ఉంటాయి. మూడవది, సులభంగా గుర్తించబడని సమస్య——భూగర్భ జలాల క్షీణత, కాలుష్యం వల్ల పర్యావరణ ప్రభావం కారణంగా భూగర్భ జలాలకు, పర్యావరణ వ్యవస్థలకు మధ్య సంబంధం క్రమంగా తెగిపోవడం. మానవ అవసరాల కోసం భారీ స్థాయిలో వినియోగం వల్ల భూగర్భ జల నిల్వలు పర్యావరణానికి, ముఖ్యంగా నదీ ప్రవాహాలకు అందించే సేవ గణనీయంగా తగ్గిపోయింది.ఒక రంగంలో క్షీణత అతిపెద్ద సమస్యగా కనిపించినప్పటికీ, కాలుష్యాన్ని పరిష్కరించే, క్షీణత సమస్యను పరిష్కరించడంలో భూగర్భ జలాల పర్యావరణ వ్యవస్థ పాత్రను గుర్తించే సమగ్ర విధానం అవసరం. ఒకటి చేసి మరొకటి చేయకపోవడం ఏ ఒక్క సమస్యను కూడా పూర్తిగా పరిష్కరించడానికి సహాయపడదు.వర్షాకాలంలోనే భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. బోరు బావుల్లో నీరు లేక మూడు గంటలకోసారి స్టార్టర్ వేస్తే పది బిందెలు కూడా దొరకడం కష్టం. చెరువులు, కుంటలు క్రికెట్ మైదానాల్లా కనిపిస్తున్నాయి. కుంటల్లో రాళ్లు తేలాయి. చెరువు దగ్గర బోర్లు కూడా మూడు వందల అడుగులు పైగా పోవాల్సి వస్తోంది. నీళ్లు లేక గొర్రెల కాపరులు ఇబ్బంది పడుతున్నారు. పశుగ్రాసం లేక పశువులను కబేళాకు తరలిస్తున్నారు. గతేడాది మార్చి నెలలోనే బోరు బావుల్లో నీరు తగ్గగా, ఈ సంవత్సరం జూన్ మొదటి వారం నుంచే తగ్గింది. ప్రభుత్వం ఎల్‌నినో ముందస్తు చర్యలు, రైతులను జాగరూకత చేయడంలో పూర్తిగా విఫలమైంది. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోమంటున్నారు కానీ ఏ నెలలకు ఏ పంట వేసుకోవాలని చెప్పడం లేదు. అన్ని చెరువుల్లో కాళ్లు తడవడం లేదు. ఖరీఫ్ సీజన్‌కు ఇచ్చిన రాయితీ విత్తనం వేరుశనగ ఇంతవరకు విత్తిన పాపాన పోలేదు. కార్తెలన్నీ పోయి కళ్లు కాయలు కాసాయి. ఆముదం, కంద, ఉలవలు, కొర్రలు, జొన్నలు, సజ్జలు ఏమి విత్తుకోవాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు. చెరువులు, కుంటల్లో నీరు అడుగట్టిపోయాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు తగ్గడంతో సాగు చేసిన వరి పంట పండుతుందో ఎండుతుందోనని ఆందోళన చెందుతున్నారు. బోరు కింద వరి పంట ఎండిపోతోంది. అప్పుడే నెర్రెలు పారాయి. మరో పదిహేను రోజులు అయితే పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం లోడు పెరగడంతో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు త్రీఫేస్ కరెంట్ సరఫరాను నిలిపివేసి సింగల్‌ఫేస్ కరెంట్‌ను అందించారు. ఇప్పటికీ కూడా విద్యుత్‌ను అధికంగా వాడుతున్న సందర్భాల్లో సరఫరాను నిలిపివేస్తున్నారు.

లోడ్ ఎక్కువైనప్పుడు జిల్లా కేంద్రం నుంచే కరెంట్ సరఫరాను నిలిపివేస్తారని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.భూగర్భ జలాలు తగ్గిపోవడానికి ప్రధాన కారణం నీటిని అతిగా వెలికితీయడం, సహజంగా భూమిలోకి నీరు ఇంకే అవకాశం తగ్గిపోవడం. వ్యవసాయం, తాగునీటి అవసరాల కోసం విపరీతంగా బోర్లు వేసి మోటార్ల ద్వారా అతిగా తోడేస్తున్నారు. వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలు పండించడం వల్ల వినియోగం పెరిగింది. నగరాలు, పట్టణాల్లో రోడ్లు, భవనాలు కాంక్రీటు మయం కావడం వల్ల వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకకుండా వృథాగా పోతోంది. రుతుపవనాలు సరిగ్గా కురవకపోవడం లేదా అస్థిర వర్షాల వల్ల భూగర్భ జలాల పునరుద్ధరణ మందగించింది. చెట్లను నరికివేయడం వల్ల నేల కోతకు గురై వర్షపు నీటిని నిల్వ చేసుకునే సహజ సామర్థ్యం కోల్పోతోంది. వర్షపు నీటి సంరక్షణ లేకపోవడం, సరైన ప్రణాళిక కొరవడటం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోంది.భూగర్భ జలాలు కంటికి కనిపించవు. కానీ వాటి క్షీణత ఇప్పుడు ప్రతి గ్రామంలో, ప్రతి పొలంలో, ప్రతి బావిలో కనిపిస్తోంది. అవగాహన పెంచకుండా, సమగ్ర నిర్వహణ చేపట్టకుండా ఈ సంక్షోభం నుంచి బయటపడటం కష్టం.

# పెన్షన్ బెనిఫిట్స్ ప్రభుత్వ సొమ్ము కాదు!

**ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాల్లో కీలక భూమిక నిర్వహించింది తెలంగాణ ఉద్యోగ వర్గం. తెలంగాణ వస్తే మెరుగైన ఉద్యోగ జీవితం ఉంటుందని, ఆంధ్ర ఆధిపత్య వివక్షలు ఉండవని, వివిధ వర్గాలకు న్యాయబద్ధమైన సామాజిక వాటాలు ప్రత్యేక రాష్ట్రంలోనే పొందగలమని ఉద్యోగులు ఆశించారు. కానీ జరిగింది అందుకు విరుద్ధం. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను నిర్వీర్యం చేసింది. నెల నెలా మొదటి తారీఖున జీతాలు పొందడాన్ని కూడా ఒక డిమాండ్‌గా దిగజార్చిన దుస్థితికి నెట్టివేసింది. డీఏలు ఇవ్వకపోవడం, పీఆర్‌సీ అమలు చేయకపోవడం, పెన్షనర్ బెనిఫిట్‌స్‌ను పెండింగ్‌లో పెట్టడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను పాత పెన్షన్ స్కీమ్‌గా మార్చకపోవడం, హెల్త్‌కార్డులను ఉచితంగా ఇవ్వకపోవడం... ఇంకా అనేక సమస్యలు ఎదురయ్యాయి. ఉద్యోగులను, పెన్షనర్‌స్‌ను ఇబ్బందులపాలు చేసినందుకు గత ప్రభుత్వం ఫలితం అనుభవించింది.**

ఇప్పటి ప్రభుత్వం కూడా ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆరు డీఏలను ఇవ్వడం లేదు. పీఆర్‌సీ అమలును పట్టించుకోవడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు తాము ఉద్యోగంలో ఉన్నప్పుడు దాచుకున్న సొమ్మును ఇవ్వడం లేదు. పైగా పెన్షనరీ బెనిఫిట్స్ ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వాలనీ, ఒక్కో ఉద్యోగికి సగటున కోటి పైనే చెల్లించాల్సి వస్తున్నదనీ, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టి ఇస్తున్నామనీ ముఖ్యమంత్రి వాపోతున్నారు!

ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చేది ఒక్క గ్రాట్యుటీ మాత్రమే. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి రిటైర్ అయ్యేదాకా ఒక ఉద్యోగి తన జీతం నుంచి పైసా పైసా ప్రభుత్వం దగ్గర దాచుకున్న సొమ్మే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ బెనిఫిట్స్. ఇవేమీ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే కానుకలు కావు. ఉద్యోగుల జీతం సొమ్ము వారికి ఇవ్వకుండా... 'ఎట్లా ఇచ్చేది? ఎక్కడ నుంచి అప్పులు తెచ్చేది? కోసినా ఒక్క పైసా లేదు, ఉచితాలు తీసి ఇవ్వాలా?' అని సమాజం ముందు ఉద్యోగులను బద్నాం చేయడం అన్యాయం. ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రజలను ప్రత్యర్థులుగా నిలబెట్టే ప్రయత్నం మంచిది కాదు.

ఉద్యోగులు దాచుకున్న సొమ్ము ఏమైంది? ఎటు మళ్లిస్తున్నారు? తెలంగాణ రాకముందు పెన్షనర్స్ పెండింగ్ బిల్స్ అంటూ లేకుండేది. ఒకటీ అరా డీఏలు పెండింగ్ ఉండేవి. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక, ఆరు కరువు భత్యాలు పెండింగ్‌లో ఉన్నాయి! బహుశా దేశంలో ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్న రాష్ట్రం మనదేనేమో! మిగతా ఏ రాష్ట్రంలోనూ ఈ దుస్థితి లేదు. ఉద్యోగులు కూడా ప్రభుత్వ యంత్రాంగంలో భాగమే. వారు లేకుండా ప్రభుత్వ వ్యవస్థలు పనిచేయవు.

ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పదవుల్లో ఒక్కరోజే ఉన్నా కూడా వారికి పెద్ద ఎత్తున జీతం, పెన్షన్ వస్తుంది. దీని మీద చర్చే ఉండది. ఉద్యోగుల లాగా వారు వారి జీతం నుంచి దాచుకునేది ఏమీ ఉండది. కానీ, ఉద్యోగులు ముప్పై నలభై ఏండ్ల పాటు పనిచేసి కూడబెట్టుకున్న సొమ్మును వారికి ఇవ్వడానికి ఇంత కాలయాపనా?! ఇంకోవైపు ప్రభుత్వ ధనమే తేరగా ఇస్తున్నట్లు ప్రచారం! ఇట్లా ఉద్యోగులను వేలెత్తి చూపే పద్ధతి ఇవ్వాల్టిది కాదు. గత ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల నుంచీ ఇదే జరుగుతున్నది.

పెన్షనర్లు దాచుకున్న సొమ్ము వారికి అందక ఈ రెండున్నరేళ్లలో డెబ్బయిమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. పిల్లల చదువులు, పిల్లల పెళ్లిళ్లు, సొంతింటి ఏర్పాట్లు, అప్పులు, అనారోగ్యాలు... ఇన్ని సమస్యల నుంచి దాచుకున్న జీపీఎఫ్, ఇన్సూరెన్స్, కమ్యూటేషన్ బెనిఫిట్‌స్‌తో బైటపడదామంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసి ఇవ్వకపోవడం వల్ల జరిగిన ఆత్మహత్యలు అవి.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యంగా ఇచ్చే డీఏ ప్రభుత్వ భిక్ష కాదు, ఉద్యోగుల హక్కు. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్ల నుంచి డీఏ ఇవ్వడం లేదు. ప్రభుత్వం దగ్గర ఒక్క పైసా లేదు అంటూనే, అనేక బహుళ ప్రాజెక్టులను చేపడుతున్నది.

గత దశాబ్దాల నుంచీ ఏ ప్రభుత్వాలూ పీఆర్సీలను సక్రమంగా అమలు చేసిన చరిత్ర లేదు. దానివల్ల వేతన సవరణ జరగడం ఆగిపోయి, కొత్త వేతనాలు అందడం లేదు. ఈ మధ్య క్యాష్‌లెస్ హెల్త్ కార్డుల విషయంలో కూడా బోర్డు ఏర్పాటు, రెఫరల్ హాస్పిటల్ లిస్ట్, కొత్త హెల్త్ కార్డులు ఇవ్వక మునుపే, ఆస్పత్రుల ఓపీ సేవలకు సంబంధించిన అంశాలను పూర్తి చేయకముందే హడావిడిగా ఇప్పటికి అయిదు నెలల నుంచి ఉద్యోగులు, పెన్షనర్స్ నుంచి ఒకటిన్నర శాతం (1.5శాతం) కట్ చేయడం దారుణం. అసలే బెనిఫిట్స్ రాక అల్లాడుతున్న పెన్షనర్ల పెన్షన్ నుంచి హెల్త్ కార్డులు రాకుండానే ఇలా కట్ చేయడం ఆపాలి. ఉద్యోగులు, పెన్షనర్లకు అప్పుబడిన ఆరు డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. పెన్షనర్స్ దాచుకున్న పెండింగ్ బెనిఫిట్‌స్‌ను వెంటనే విడుదల చేయాలి. పీఆర్‌సీని అమలు చేయాలి.

# జర్మనీలో మళ్లీ నాజీ నినాదాలు

**రెండో ప్రపంచ యుద్ధమంటే- చరిత్రలో మానవాళి మరెన్నడూ చూడని మారణహోమం మదిలో మెదులుతుంది. రణరంగంలో నెత్తురోడుతూ, ఆకలితో అలమటిస్తూ, రోగాలతో అల్లాడుతూ మొత్తంగా 7-8.5కోట్ల మంది మృత్యువాత పడటం గుర్తొచ్చి గుండె బరువెక్కిపోతుంది. అలవిమాలిన జాత్యహంకారంతో జాతిహననాలకు తెగబడి ప్రత్యక్షంగా 1.7కోట్ల మంది ప్రాణాలు తీసిన హిట్లర్ సేనలు, వాటి భాగస్వాముల హేయ అకృత్యాలకు ఆనాడు మానవత్వమే మంట కలిసిపోయింది. వికృత ఉన్మాదంతో పేట్రేగి వినాశకర విశ్వసమరానికి కారణమైన నాజీ పార్టీ సభ్యుల్లో అందరూ నేరగాళ్లు కాదంటూ వెనకేసుకొచ్చే 'ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ'(ఏఎఫ్‌డీ) ఇప్పుడు ఆ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 'ప్రతిదీ జర్మనీదే' అన్న నాజీల నినాదాన్ని వల్లెవేసే నాయకులకు నెలవైన ఏఎఫ్‌డీ, ఇటీవల జరిగిన సక్సోనీ-యాన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో 44శాతం ఓట్లు చేజిక్కించుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. సొంతంగా గద్దెనెక్కడానికి దానికి మూడు సీట్లు తక్కువయ్యాయి కానీ, 1945 తర్వాత జర్మనీలో ఓ అతిమితవాద రాజకీయపక్షం అధికారానికి ఇంత చేరువగా రావడం ఇదే ప్రథమం! ఏఎఫ్‌డీ విజయం ఐరోపా దేశాల్లోని మితవాదులను అమితంగా సంతోషపెడితే- జర్మన్ ప్రజాస్వామ్యవాదులను మాత్రం కలవరపరుస్తోంది!**

నాజీల దురాగతాలను తక్కువ చేసి చూపడంలో ఏఎఫ్‌డీ శ్రేణులు ముందుంటాయి. నాటి అరాచకాలను తలచుకుంటూ పశ్చాత్తాపపడటం మానుకోవాలని ఆ పార్టీ నేతాగణాలు పిలుపిస్తుంటాయి. వలసలను పూర్తిగా వ్యతిరేకించే ఆ పార్టీ పోకడల్లో జర్మనీలో అనధికారికంగా ఉండేవారిపైనే కాదు చట్టబద్ధంగా నివసిస్తున్న, పౌరసత్వం కలిగిన విదేశీయులందరిపైనా విద్వేషం ఎగదన్నుతుంటుంది. ఈయూతో కలిసి నడవటాన్ని నిరసిస్తూ 2013లో జర్మన్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఏఎఫ్‌డీ ఆ ఏడాది పార్లమెంట్ ఎన్నికల్లో బోణీకొట్టలేకపోయింది. 2015 వలసల సంక్షోభం దరిమిలా తీవ్రస్థాయి మితవాద ధోరణులను అలవరచుకుని 2025కు వచ్చేసరికి ఓట్లశాతాన్ని నాలుగురెట్లకు పెంచుకుని 152 సీట్లు సాధించి, జాతీయ స్థాయిలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగింది. ప్రస్తుతం జర్మనీలోని 16 రాష్ట్రాల శాసనసభల్లో 15 చోట్ల దానికి ఎంతోకొంత ప్రాతినిధ్యం ఉంది. కరడుగట్టిన ఛాందస భావజాలానికి పేరుమోసిన ఏఎఫ్‌డీ జర్మనీ జనసామాన్యంలో పరపతిని పెంచుకుంటుండటం ఐరోపా ఐకమత్యాన్ని కోరుకునే ఇరుగుపొరుగు దేశాల నాయకులకు గుబులు పుట్టిస్తోంది!

అన్నింటా జర్మనీ తన దారి తాను చూసుకోవాలని, సరిహద్దులను మూసేయాలని వాదించే ఏఎఫ్‌డీ విధానాలకూ ఈయూ సంకల్పాలకూ సరిపడదు. బహుళ సంస్కృతుల సంగమంగా, ఉదారవాద ప్రజాస్వామ్య దేశంగా ఉంటే జర్మనీ అస్తిత్వానికే ప్రమాదమని ఏఎఫ్‌డీ వర్గాలు వాదిస్తుంటాయి. మిగిలిన జర్మన్లకు భిన్నంగా రష్యాకు వంతపాడుతుంటాయి. ఆర్థిక సమస్యలు అధికం కావడం, పారిశ్రామిక ప్రగతి అనిశ్చితిలో పడటం, హరిత ఇంధనాలకు మారే క్రమంలో ఖర్చులు పెరగడం, విపరీతమైన వలసలతో స్థానిక వనరులు ఒత్తిడికి గురవుతుండటం వంటివి జర్మనీ సంకీర్ణ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకతను పెంచుతున్నాయి. ప్రధాన స్రవంతి పార్టీలు స్వలాభాలకోసం తమను విస్మరిస్తున్నాయనే భావన సామాన్యుల్లో ప్రబలమవుతోంది. ఆ అసమ్మతిని తన గళంలో పలికిస్తూనే జాతీయ భద్రత, సాంస్కృతిక వారసత్వాలను ప్రస్తావిస్తూ ఏఎఫ్‌డీ వేగంగా విస్తరిస్తోంది. ప్రజాసమస్యల పరిష్కారంపై జర్మనీ పాలకపక్షాలు దృష్టిసారిస్తేనే నాజీల సానుభూతిపరులను ఎప్పుడూ అధికారంలోకి రానివ్వకూడదన్న వాటి లక్ష్యం నెరవేరుతుంది.

# స్ఫూర్తిప్రదాత మోక్షగుండం

- పంచాయతీరాజ్ ఈ.ఎన్.సీ బాలు నాయక్
- అనంతపురంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహావిష్కరణ
- ఇంజినీర్లందరికీ ఆదర్శం మోక్షగుండం జీవితం



**అనంతపురం సెప్టెంబర్ 15 అనంత జనశక్తి న్యూస్**

సాంకేతిక రంగంలో అద్భుతాలు సృష్టించి భారతరత్నగా పేరుగాంచిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీర్లందరికీ స్ఫూర్తిప్రదాతగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈ.ఎన్.సీ) బి.బాలు నాయక్ కొనియాడారు. అనంతపురంలోని పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఈ.ఎన్.సీ బాలు నాయక్ మంగళవారం ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ సర్కిల్ కార్యాలయ ఆధునికీకరణ అనంతరం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ.ఎన్.సీ మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ప్రతి ఇంజినీర్ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అప్పుడే ఆయన కలలను మనం నిజం చేసిన వారమవుతామన్నారు. మెరుగైన దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర ప్రముఖంగా ఉండాలని కోరారు. అందుకు ఇంజినీర్లుగా స్థిరపడిన వారితో పాటు భావి ఇంజినీర్లు కూడా ఆ దిశగా అడుగులు వేయాలని, అప్పుడే రాణించగలరన్నారు.

**ఎస్ఈ వై.చిన్నసుబ్బరాయుడును అభినందించిన ఈఎన్సీ బాలు నాయక్**

అనంతపురంలోని సర్కిల్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని పీఆర్ ఈ.ఎన్.సీ బాలు నాయక్ అన్నారు. అందుకు కృషి చేసిన పీఆర్ సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ఇంజినీర్ వై.చిన్నసుబ్బరాయుడును ఆయన అభినందించారు. కార్యాలయాన్ని సైతం ఆధునికీకరణకు చొరవ చూపడం గర్వంగా ఉందన్నారు. గతంలో ఏ ఎస్ఈ కూడా ఇలా ఆలోచన చేయలేదని, ప్రస్తుత ఎస్ఈ సుబ్బరాయుడు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కార్యాలయ ఆధునికీరణతో పాటు ఇంజినీర్ల ఆరాధ్యుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించి, మోక్షగుండం జయంతికి పూర్తి చేయడం గర్వంగా ఉందన్నారు. అందుకు సహకరించిన ఇంజినీర్లు, సిబ్బందినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్లు భాగ్యరాజ్, ప్రభాకర్రెడ్డి, పీ.ఆర్.ఐ, పీఐయూ, క్వాలిటీ కంట్రోల్ ఈఈలు రాజన్న, నాగిరెడ్డి, శంకరయ్య, భాస్కర్, అనంతపురం సబ్ డివిజన్ 1, డీఈఈలు కె.లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ, క్వాలిటీ కంట్రోల్ డీఈఈలు లోకన్న, గోపాల్ నాయక్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఇంజినీర్లు, ఎస్.ఈ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

- పంచాయతీరాజ్ ఇంజినీర్లకు అవార్డుల ప్రదానోత్సవంలో ఈ.ఎన్.సీ బాలునాయక్




**అనంతపురం సెప్టెంబర్ 15 అనంత జనశక్తి ఈ**

విధి నిర్వహణలో నీతి, నిజాయతీతో పాటు సమర్ధవంతంగా సేవలందించినప్పుడు లభించే గుర్తింపు జీవితంలో సంతృప్తినిస్తుందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఈ.ఎన్.సీ) బి.బాలునాయక్ అన్నారు. అనంతపురంలోని పీఆర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన భారతదేశ ఇంజినీరింగ్ నిపుణుడు, రాజనీతిజ్ఞుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతికి మోక్షగుండం అందించిన సేవలను కొనియాడారు. అనంతరం విధి నిర్వహణలో సమర్థవంతంగా సేవలందించి, తమకు ఇచ్చిన లక్ష్యాలను సాధించిన ఇంజినీరింగ్ అధికారులకు అవార్డులతో సత్కరించారు. రిటైర్డ్ ఎస్ఈలు భాగ్యరాజ్, ప్రభాకర్రెడ్డి సహా అనంతపురం పీఆర్ఐ సబ్ డివిజన్ 1 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె. లక్ష్మీనారాయణ, చెన్నేకొత్తపల్లి ఏఈ అబ్దుల్ ఖాదర్, ఎస్ఈ కార్యాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరణ్, ఇతర డీఈఈలు, ఏఈఈలు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఈ.ఎన్.సీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. అవార్డులు అందుకున్న ఇంజినీరింగ్ అధికారులు ఇదే స్ఫూర్తితో పని చేసి, మున్ముందు తమకు కేటాయించే లక్ష్యాలను పూర్తి చేయడానికి కృషి చేయాలని సూచించారు. అవార్డులు అనేవి మన పని తీరుకు, సమర్థతకు గీటురాయి అని చెప్పారు. ప్రతి ఒక్కరూ కష్టపడుతారని, అయితే అంకితభావం, చిత్తశుద్ధితో పని చేస్తే మెరుగైన ఫలితాలు సాధించగలరన్నారు. ఇప్పుడు అవార్డులు అందుకుంటున్న ఇంజినీర్లను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ఇంజినీర్ వై. చిన్నసుబ్బరాయుడు, రెండు జిల్లాల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, ఎస్ఈ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విఘ్నాలు తొలగి.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు
- గణనాథుడికి విశేష పూజలు చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి కుటుంబ సభ్యులు




**అనంతపురం సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. తెలుగుదేశం పార్టీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తోపాటు వారి కుటుంబ సభ్యుల పేర్లపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నాయకులు, కార్యకర్తలకు తీర్థప్రసాదాలను అందజేశారు. వినాయక చవితి సందర్భంగా అన్న ప్రసాద కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులకు పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం అనంతపురం అర్బన్ నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# రూ.2000 యూపీఐ పేమెంట్‌పై చార్జీలు

(మొదటి పేజీ తరువాయి)




కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ సెప్టెంబర్ 14న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. ఈ నూతన నిబంధనలు అక్టోబర్ 15 నుండి అమలులోకి రానున్నాయి.

**సాధారణ జనాల పరిస్థితేంటి?**

ఈ కొత్త విధానం వల్ల సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎప్పటిలాగే యూపీఐ లావాదేవీలు ఉచితంగా చేసుకోవచ్చు. మీరు షాపుల్లో, టీ కొట్టు వద్ద, కూరగాయల మార్కెట్‌లో లేదా కిరాణా షాపుల్లో చేసే సాధారణ యూపీఐ చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు పడవు. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి పంపే డబ్బులపై ఎలాంటి రుసుములు ఉండవు. బ్యాంకులకు లేదా పేమెంట్ యాప్‌లకు రూ.2,000 వరకు ఉండే యూపీఐ లావాదేవీల పై ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఛార్జీలు వసూలు చేసే అధికారం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రూపే డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది.

**చిన్న వ్యాపారులు సేఫేనా?**

ఎండీఆర్ ఛార్జీలు చిన్న వ్యాపారులకువర్తించవు. నెలకు రూ.లక్ష వరకు బ్యాంక్ ఖాతాలోకి క్యూఆర్ కోడ్ ద్వారా స్వీకరించే చిన్న వ్యాపారులకు ఈ విధానం ఉండదు. రైల్వేలు, టెలికాం సేవలు, బీమా, ఇంధనం లాంటి వాటికి రూ.2000 దాటితే ఒక్కో లావాదేవీకి ఫ్లాట్‌గా రూ.5 ఎండీఆర్ వర్తిస్తుంది. ఒక్కో లావాదేవీకి ఎండీఆర్ రుసుము గరిష్టంగా రూ.300 మించకుండా పరిమితి విధించారు. దేశవ్యాప్తంగా జరిగే మొత్తం యూపీఐ లావాదేవీలలో సుమారు 96 శాతం చెల్లింపులు రూ.2,000 కంటే తక్కువ విలువైనవే. వ్యాపార సంస్థలకు జరిగే చెల్లింపుల్లో కేవలం 4 శాతం లావాదేవీలు మాత్రమే రూ.2,000 కంటే ఎక్కువ విలువ కలిగి ఉన్నాయి. కాబట్టి మెజారిటీ ప్రజలపై ఈ నిర్ణయం ఎలాంటి ఆర్థిక భారం వేయదు.

**భారం ఎవరిపై?**

ఈ రుసుమును కేవలం వ్యాపారుల నుంచి మాత్రమే వసూలు చేస్తారు తప్ప కొనుగోలుదారుల (వినియోగదారుల) నుంచి కాదు. ఈ రుసుముల ద్వారా వచ్చే ఆదాయంలో 40 శాతం బ్యాంకులకు, మిగిలిన 60 శాతం మొత్తాన్ని సంబంధిత పేమెంట్ యాప్‌లు, అగ్రిగేటర్లు చెరిసగం పంచుకునేలా ప్రణాళిక రూపొందించారు. రూ.3వేలు పేమెంట్ చేస్తే రూ.12, రూ.50వేలకు రూ.200, రూ.75వేల పైన పేమెంట్ చేస్తే రూ.300లు వ్యాపారులు చెల్లించాలి.

**యూపీఐ రికార్డు స్థాయి వృద్ధి**

ఎన్‌పీసీఐ నివేదిక ప్రకారం గత ఆగస్టు (2026) ఒక్క నెలలోనే యూపీఐ ద్వారా 2,450 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. వీటి మొత్తం విలువ దాదాపు రూ.29.82 లక్షల కోట్లు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో భారత్ సాధించిన ఈ అసాధారణ ప్రగతిని దృష్టిలో ఉంచుకుని, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదని అధికారులు చెబుతున్నారు.

# శ్రీవారికి చంద్రబాబు పట్టువస్త్రాలు



**తిరుమల, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది.

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం 6.21 నుండి 6.35 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళ వాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాశస్త్యం.ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గరుడాళ్వార్ చిత్రం కలిగిన ధ్వజ పటాన్ని ఆలయంలోకి తీసుకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం లోపల ఉన్న తిరుమలరాయ మండపంలో ఉత్సవ మూర్తులకు ఆస్థానం నిర్వహించారు.

# ప్రజల సంక్షేమమే నా జీవిత లక్ష్యం



- డాక్టర్ నాసిర్ యాసిన్

**నల్లచెరువు సెప్టెంబర్ 15 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు ఎస్సీ కాలనీలో సిమ్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్,ఎన్.వై.పి.ఎస్.ఎన్ ఫౌండర్ నిసార్ యాసిన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు నిసార్ యాసిన్ కు అంబేద్కర్ నగర్ వాసులు మరియు శ్రీ మారెమ్మ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు ఈ ఉచిత శిబిరంలో స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను వైద్యులు పరిశీలించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు పేద,మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అంబేద్కర్ నగర్ స్థానికులు నిసార్ యాసిన్ సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సేవలు అందించిన సిబ్బంది ప్రతి ఒక్కరికి కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ మారెమ్మ స్వామి ఆలయ కమిటీ సభ్యులు మరియు అంబేద్కర్ నగర్ వాసులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనం ను తొందరగా పూర్తి చేయాలి

- శోభాయాత్ర లో నిబంధనలు పాటించాలి
- సిఐ శ్రీనివాసులు

**యాడికి , సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్ :**



యాడికి మండలంలో నిర్వహించు గణేష్ శోభాయాత్ర ,గణేష్ ఉత్సవ విగ్రహాల నిమజ్జనంను బుధవారం తొందరగా పూర్తి చేయాలని సిఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు మాట్లాడుతు మండలంలోని చిన్న చిన్న విగ్రహాలు అనగా విగ్రహం ఎత్తు ఒక అడుగు నుండి సుమారు 5 అడుగులు ఉన్న విగ్రహాలను తేర్నాంపల్లి గ్రామ సమీపంలో ఉన్న నీటి కుంటలో నిమజ్జనం చేసుకొనవలెనని, పెద్ద విగ్రహాలను చీమల వాగుపల్లి గ్రామ సమీపం వద్ద ఉన్న నీటి కుంటలో నిమజ్జనం చేసుకొనవలెనని తెలిపారు. విగ్రహాల శోభయాత్ర జరుగు సమయంలో విగ్రహాలను తీసుకుని వెళ్ళు వాహనాలలో చిన్నపిల్లలను కూర్చుని పెట్టుకొనడం గాని, వారిని నిమజ్జన ప్రదేశానికి తీసుకొని పోవటం గాని నిషేధం అని, అధిక ధ్వని కలిగించు పరికరాలను వాడకూడదని, కలుషిత రంగులను చల్లుకొనటం చేయరాదు, విగ్రహాల శోభయాత్రను ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించి , అతి త్వరగా నిమజ్జన కార్యక్రమును పూర్తి చేయవలెని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా మీ యొక్క వాహనాలను సరైన క్రమంలో తీసుకుని వెళుతూ ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించవలెనని, ప్రజలు అందరూ ఐక్యత తో బాధ్యతాయుతంగా ఉండి, యాడికి మండలమునకు మంచి పేరు తీసుకుని వచ్చే విధంగా ప్రవర్తించాలని తెలిపారు. ఏదైనా అత్యవసర సమయము నందు పోలీసు సేవలను ఉపయోగించుకోవలెనని, ముఖ్య సమాచారం కొరకు ఇన్స్పెక్టర్ కి గాని యాడికి ఎస్ఐ కి గాని సమాచారం అందించమని కోరారు.

# కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం నగరంలోని పాతవూరు అమ్మవారి శాలలో కొలువుదీరిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని జిల్లా ఇంచార్జ్ మంత్రి టీజీ భరత్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ , టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తో కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతపురం నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన గణనాథుని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో నాయకులు, భక్తులు పాల్గొన్నారు. తదుపరి పాతవూరు అమ్మవారి శాలలో నిర్వహించిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి టీజీ భరత్ గారితో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సోదరులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సమాజ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డితో నాకు గొడవల్లేవ్

(మొదటి పేజీ తరువాయి)

"సీఎం రేవంత్‌రెడ్డితో నాకు ఎక్కడా గొడవ జరగలేదు. పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమే. మా మధ్య గ్యాప్ ఉందని, గొడవ జరిగిందని ప్రచారం జరుగుతోంది. అలాంటివి ఏమీ లేవు. సీఎంతో అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరి చేసుకున్నాం. పార్టీ విషయంలో సీఎం ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. బీసీ మంత్రిని తొలగించినప్పుడు నేను కూడా బాధపడ్డా. ఏఐసీసీ నిర్ణయం మేరకే సురేఖపై చర్యలు తీసుకున్నాం. క్రమశిక్షణ తప్పితే ఎవరిపైన అయినా చర్యలు తప్పవు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఏఐసీసీ నిర్ణయించింది" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

తప్పకుండా. రెండు మంచి హెడ్డింగ్‌లతో,
పత్రికా వార్తా శైలిలో ఇలా ఇవ్వవచ్చు



**- చెన్నూరు పుష్కర ఘాట్ అభివృద్ధికి భూమి పూజ**
**- పుష్కరాలకు ముందే పనులు పూర్తి చేయాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి**

చెన్నూరు సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

రాబోయే పుష్కరాలను పురస్కరించుకుని చెన్నూరు పట్టణంలోని పుష్కర ఘాట్ అభివృద్ధి పనులకు కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కర ఘాట్‌ను పరిశీలించిన మంత్రి, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.పుష్కరాలకు వచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని మంత్రి సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ఘాట్ అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ మహిళల స్వయం ఉపాధికి 'ఇంటింటికీ ఇందిరమ్మ-కుట్టు మిషన్'

**- చివరి తేదీలోగా అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలి: కాంగ్రెస్ నాయకులు**

నాగర్‌కర్నూల్: సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్



బీసీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న 'ఇంటింటికీ ఇందిరమ్మ-కుట్టు మిషన్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ పథకం ద్వారా బీసీ మహిళలకు కుట్టు మిషన్లు అందించి ఇంటి వద్ద నుంచే ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.బీసీ కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన మహిళలు చివరి తేదీలోగా దరఖాస్తు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి, ముఖ్యంగా బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇస్తోందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కమ్యూనికేషన్ కోఆర్డినేటర్ తైలీ శ్రీనివాసులు తెలిపారు.నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో బీసీ మహిళలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ఎంపీ డాక్టర్ మల్లు రవి చొరవ తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీసీ మహిళల సాధికారతతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు.

## ఆపదలో అండగా కాంగ్రెస్ పార్టీ




**- ఉంద్యాలలో బాధిత కుటుంబాలకు పరామర్శ.. ఆర్థిక సాయం**

చిన్న చింతకుంట, సెప్టెంబర్ 15:అనంత జనశక్తి న్యూస్

చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సోదరుడు జి. భాస్కర్ రెడ్డి పర్యటించి పలువురు బాధితులను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన సిపురం రాములు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందించారు.అదేవిధంగా ప్రమాదవశాత్తు గాయపడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భానుల మన్యంను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విలేకరి సారంగంను కూడా భాస్కర్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారి కుటుంబానికి భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, ప్రజల కష్టాల్లో భాగస్వామిగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె. వెంకటేష్ యాదవ్, ఉంద్యాల గ్రామ సర్పంచ్ కోట్ల ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మెయిన్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### మహిళా సాధికారత నుంచి ఆర్థిక యాజమాన్యం దిశగా

# బ్రిక్స్ మహిళా పారిశ్రామికవేత్తలకు 'ఎకనామిక్ కారిడార్' ఏర్పాటు చేయాలి







**- అపోలో ఫౌండేషన్ వైస్ చైర్‌పర్సన్, యూఆర్‌లైఫ్ వ్యవస్థాపకురాలు ఉపాసన కామినేని కొణిదెల**

హైదరాబాద్, సెప్టెంబరు 15: అనంత జనశక్తి న్యూస్

మహిళా సాధికారత కేవలం ప్రాతినిధ్యానికి పరిమితం కాకుండా మూలధనం, మార్కెట్లు, పెట్టుబడులు, ఆస్తులు, వ్యాపార యాజమాన్యంగా మారాలని అపోలో ఫౌండేషన్ వైస్ చైర్‌పర్సన్, యూఆర్‌లైఫ్ వ్యవస్థాపకురాలు ఉపాసన కామినేని కొణిదెల అన్నారు. బ్రిక్స్ దేశాల మహిళా పారిశ్రామికవేత్తలను అనుసంధానించేందుకు 'బ్రిక్స్ విమెన్ ఎకనామిక్ కారిడార్' ఏర్పాటు చేయాలని ఆమె ప్రతిపాదించారు. న్యూఢిల్లీలో భారత్ బ్రిక్స్ అధ్యక్షతన నిర్వహించిన బ్రిక్స్ విమెన్ బిజినెస్ అలయన్స్ విమెన్‌లెడ్ డెవలప్‌మెంట్ సమ్మిట్-2026లో ఉపాసన ప్రసంగించారు. మహిళా అభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలోని అభివృద్ధి దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు స్టార్టప్ వేదికలు అవార్డులకే పరిమితం కాకుండా పెట్టుబడులకు, నెట్‌వర్కింగ్ వ్యాపార ఒప్పందాలకు, ఆర్థిక సమ్మిళితత ఆస్తులు-పెట్టుబడుల సృష్టికి దారితీయాలని సూచించారు. ఆరోగ్యం, సంపద, స్వతంత్ర నిర్ణయాధికారం మహిళల ఆర్థిక సాధికారతకు కీలకమన్నారు.

"మహిళకు బల్ల దగ్గర కేవలం స్థానం ఇవ్వడం కాదు.. ఆ బల్లలోనే వాటా ఇవ్వాలి. అప్పుడే నిజమైన ఆర్థిక శక్తి లభిస్తుంది" అని ఉపాసన పేర్కొన్నారు. ఎకనామిక్ కారిడార్ ద్వారా మహిళల ఆధ్వర్యంలోని సంస్థలకు పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్లు, కొనుగోలుదారులు, భాగస్వామ్యాలు, సరిహద్దులు దాటి వ్యాపార అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మహిళలు ఎంత మంది పాల్గొంటున్నారన్నదే కాకుండా ఎంతమంది యాజమాన్యం, పెట్టుబడులు, నాయకత్వం, సంపద సృష్టిలో ముందున్నారన్నదే అభివృద్ధికి కొలమానంగా ఉండాలని స్పష్టం చేశారు.

# ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల అమలుపై పార్లమెంటరీ కమిటీ సమావేశం

**- రైల్వే శాఖలో రిజర్వేషన్ విధానంపై సమగ్ర చర్చ**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్




న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ అనెక్స్ ప్రధాన కమిటీ గదిలో జరిగిన 'షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ పార్లమెంటరీ కమిటీ' సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి హాజరయ్యారు. సమావేశంలో రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డులో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు అమలవుతున్న రిజర్వేషన్ విధానంపై సమగ్రంగా చర్చించారు. రైల్వే శాఖలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్ హక్కులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే అంశంపై కమిటీ ప్రత్యేకంగా దృష్టి సారించింది.ఈ సందర్భంగా అఖిల భారత ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రైల్వే ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలు, ఉద్యోగ అవకాశాలు, పదోన్నతులు, ఎదురవుతున్న సమస్యలకు సంబంధించిన వివరాలను కమిటీ ముందు సమర్పించారు.అదేవిధంగా రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డు ప్రతినిధులు రిజర్వేషన్ అమలుకు సంబంధించిన నిబంధనలు, శాఖాపరమైన చర్యలు, ప్రస్తుత పరిస్థితిపై కమిటీకి వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పార్లమెంటరీ కమిటీలు కీలకంగా పనిచేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలను పార్లమెంటరీ వేదికలపై ప్రస్తావిస్తూ వారి హక్కుల సాధనకు డాక్టర్ మల్లు రవి కృషి చేస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ఎస్సీ-ఎస్టీలకు సమాన అవకాశాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని డాక్టర్ మల్లు రవి తెలిపారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన

# మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్

**- కంగ్టి మండలంలో మృతుల కుటుంబాలకు పరామర్శ.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ధైర్యం**

కంగ్టి సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్



నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలంలో పలువురు బాధిత కుటుంబాలను మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్ పరామర్శించారు.ముకుద్ నాయక్ తండాకు చెందిన ఆడే పుండ్లిక్ నాయక్ కుమార్తె అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న నగేష్ కుమార్ షెట్కర్, పుండ్లిక్ నాయక్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.అనంతరం కంగ్టి మండలానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ హనుమంత్ పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అదే గ్రామానికి చెందిన జలీల్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో జలీల్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నగేష్ కుమార్ షెట్కర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కంగ్టి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్దార్ నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ పటేల్, చందర్ రెడ్డి, లోండే నర్సింలు, విద్యప్ప షెట్కర్, మైపతి, చేనప్ప, జనీసాబ్, సంతోష్ రెడ్డి, విఠల్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే సభ్యులకు మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కర్ సన్మానం



**- ప్రజలకు, ప్రభుత్వానికి జర్నలిస్టులు వారధిగా పనిచేయాలి**

నారాయణఖేడ్ సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్

నారాయణఖేడ్ నియోజకవర్గ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్-ఐజేయూ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) నూతన కమిటీ సభ్యులను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కర్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాగేష్ షెట్కర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. నూతనంగా ఏర్పడిన టీయూడబ్ల్యూజే-ఐజేయూ నియోజకవర్గ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి అబ్దుల్ రాహూఫ్, కార్యవర్గ సభ్యుడు హసీబ్ పటేల్, నియోజకవర్గ అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి కే. భూమయ్య, ఉపాధ్యక్షులు బిరాదర్ సంగప్ప, మూడ అశోక్ కుమార్, నిసార్, కోశాధికారి నాతేక్, సంయుక్త కార్యదర్శులు జైపాల్ రెడ్డి, మహమ్మద్ ఫహీమ్, అంబదాస్, నిర్వహణ కార్యదర్శి వీర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు

**- మాజీ అధ్యక్షులు, యూత్ పెద్దలకు ఘన సన్మానం భక్తిశ్రద్ధలతో మొదటి రోజు పూజలు**

మహేశ్వరం, సెప్టెంబర్ 15 అనంత జనశక్తి న్యూస్

మహేశ్వరం మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి.వేడుకల్లో భాగంగా మొదటి రోజు ఉదయం గణనాథుడికి ప్రత్యేక అలంకరణ చేసి, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు, పాలాభిషేకం, అష్టోత్తర పూజ నిర్వహించారు. యువజన సంఘం సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. జై బోలో గణేష్ మహరాజ్ కీ జై నినాదాలతో, భక్తి కోలాహలంతో మండపం మారుమోగింది.ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి, గ్రామంలో భక్తి కార్యక్రమాల నిర్వహణకు ఎంతో కృషి చేసిన యువజన సంఘం మాజీ అధ్యక్షులను, యూత్ పెద్దలను ఘనంగా సన్మానించారు. సంఘ ప్రస్తుత అధ్యక్షులు, ఉపాధ్యక్షుల చేతుల మీదుగా వారికి శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. వారి సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలు 9 రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతాయని, ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నాదర్గుల్ బస్టాండ్ గణేష్ మండపంలో ఘనంగా పూజలు

**- రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండాలి**

**- విఘ్నేశ్వరునికి లక్ష రూపాయల విరాళం అందజేసిన చెరుకుపల్లి వెంకటరెడ్డి**

**మహేశ్వరం, సెప్టెంబర్ 15,( అనంత జనశక్తి న్యూస్**



రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో చల్లగా ఉండాలని బీజేపీ నాయకులు చెరుకుపల్లి వెంకట రెడ్డి అన్నారు.వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాదర్గుల్ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక ఉత్సవ సమితి ప్రతిష్టించిన విఘ్నేశ్వరునికి చెరుకుపల్లి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వినాయక విగ్రహ ప్రతిష్టాపనకు *రూ. 1,00,000/ (లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..గత 30 సంవత్సరాల క్రితం కూడా వినాయక విగ్రహానికి విరాళాలు అందించడం జరిగిందని, అలాగే గతంలో విఘ్నేశ్వరుని లడ్డూ ప్రసాదం రెండు పర్యాయాలు తమ కుటుంబానికి దక్కడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలు, యావత్ తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు, దీవెనలు, కరుణ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు జక్కిడి ఉపేందర్ రెడ్డి గారు, మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ యాతం యాదయ్య గారు, వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు తోట సంతోష్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్ గౌడ్, పాలుబాయ్ లక్ష్మణ్, ఏనుగు మోహన్ రెడ్డి, గూడూరు చంద్రశేఖర్ రెడ్డి, ఏనుగు వెంకట్ రెడ్డి, పెత్తుల పుల్లారెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేను చెప్పేవి నిజాలే

**అబద్ధాలైతే.. రాజకీయాల నుంచి వైదొలగుతా: మాధవరం కృష్ణారావు**

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**



**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో తన గురించి చేసిన ప్రస్తావనపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. హైదర్‌నగర్‌లో 145, 163 సర్వే నంబర్లలోని భూమి చాలా ఏళ్లుగా రిజిస్ట్రేషన్లు కావట్లేదని మంత్రి తప్పుదోవ పట్టించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా ఏడాదిపాటు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిపారు. 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి రానిస్తే.. 22ఏపై అన్ని ఆధారాలతో నిరూపిస్తానని, తాను చెప్పేవి అబద్ధాలైతే రాజకీయాల నుంచి వైదొలగుతానని కృష్ణారావు అన్నారు.**

# ప్రజలు తిరస్కరించిన వైసీపీకి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదు

**- సూపర్ సిక్స్ హామీలను సూపర్ సక్సెస్ చేశాం : మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**- వైసీపీ ఐదేళ్లలో చేయలేని అభివృద్ధి రెండేళ్లలో చేసి చూపించాం**

**- సంజామల ఎంపీడీవో కార్యాలయంలో మీడియా సమావేశంలో మంత్రి**

**బనగానపల్లె సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**




ప్రజలు 164 సీట్లతో కూటమి ప్రభుత్వానికి అఖండ మెజార్టీతో అధికారం కట్టబెడితే, వారి రుణం తీర్చుకునేందుకు, ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తుంటే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు & పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. నేడు బనగానపల్లె నియోజకవర్గం సంజామల ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన వైసీపీకి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కూటమి ప్రభుత్వం ఇప్పటికే 90 శాతానికి పైగా అభివృద్ధి, సంక్షేమ హామీలను అమలు చేసిందని మంత్రి తెలిపారు. పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచి ఇచ్చామని, 'తల్లికి వందనం' పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ప్రయోజనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇద్దరు పిల్లలకే తల్లికి వందనం అంటూ హామీ ఇచ్చి మాట మార్చిన మోసం చేసిన చరిత్ర వైసీపీదేనని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.. మహిళలకు 'స్త్రీ శక్తి' ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రతి మహిళకు నెలకు సుమారు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఆర్థిక ప్రయోజనం కలుగుతోందన్నారు. రైతులకు ఇచ్చిన మాట మేరకు 'అన్నదాత సుఖీభవ'ను అమలు చేసి చూపించామని తెలిపారు.

**వైసీపీ ఐదేళ్ల పాలనకు.. కూటమి రెండేళ్ల పాలనకు ఇదే తేడా**

వైసీపీ ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే, కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కొత్త ఊపునిచ్చిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టి, గ్రామీణ మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గతంలో నిలిచిపోయిన ఇరిగేషన్ ప్రాజెక్టులను తిరిగి గాడిలో పెట్టి, సాగు మరియు తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేని వైసీపీ.. ఉద్యోగాలపై మాట్లాడటమా?**

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ ఉద్యోగం కూడా ఇవ్వని నాయకులు, వేలాది ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్న మంత్రి నారా లోకేష్పై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.. కష్టపడి చదువుకుని ఉద్యోగాలు సాధించిన టీచర్లను అవమానించేలా వైసీపీ నేతల వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీపై సీబీఐ విచారణ అవసరం లేదని హైకోర్టు చెప్పినప్పటికీ అదే అంశాన్ని పదేపదే రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

**అక్రమ కేసుల వైసీపీ.. ప్రజాస్వామ్య పాఠాలు చెప్పడం విడ్డూరం**

మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేస్తున్న అక్రమ కేసుల ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. గత రెండేళ్లలో అనేక ధర్నాలు, నిరసనలు జరిగినప్పటికీ కూటమి ప్రభుత్వం ఆయనపై ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. అనుమతులు లేకుండా నిరసనలు చేసినా ప్రభుత్వం సంయమనంతో, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. తనపై తొమ్మిది అక్రమ కేసులు పెట్టిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదేనని, అలాంటి వారు నేడు ప్రజాస్వామ్యం, హక్కుల గురించి నీతులు చెప్పడం విడ్డూరమన్నారు. అక్రమ కేసులకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన వైసీపీ.. ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పాఠాలు చెబితే, ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. పంచాయతీల్లో అవినీతి జరిగితే ఉపేక్షించబోమని మంత్రి స్పష్టం చేశారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**ఎల్ నినో ప్రభావం ఉన్నా.. తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు**

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే స్థానికంగా అవుకు, రామభద్రపురం, కైప, టంగుటూరు చెరువులను నింపి తాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో నీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే, వైసీపీ నాయకులు కాలువలు, చెరువుల వద్ద ధర్నాలు చేయడం కేవలం రాజకీయ ప్రచారం కోసమేనని విమర్శించారు.

స్థానిక సంస్థల ఎన్నికలను అపహాస్యం చేసిన వైసీపీ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మంత్రి ఆరోపించారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అడ్డుకోవడం, అధికారుల ద్వారా బెదిరింపులు, నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిళ్లు వంటి అనేక అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అలాంటి చరిత్ర ఉన్న వైసీపీ నాయకులు ఇప్పుడు స్థానిక ఎన్నికల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తుందన్నారు... గెలుపోటములు నిర్ణయించేది నాయకులు కాదని, ప్రజలే నిర్ణయిస్తారని మంత్రి స్పష్టం చేశారు.మళ్లీ అధికారంలోకి వస్తామనే భ్రమలో వైసీపీ నాయకులు పగటి కలలు కంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తప్ప, ప్రజల కోసం వైసీపీ చేసిందేమీ లేదన్నారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన పార్టీ.. ప్రజలు ఎందుకు తిరస్కరించారో ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదనే వాస్తవాన్ని వైసీపీ నాయకులు మర్చిపోవద్దు అని హితభోద చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, మౌలిక వసతుల పై నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలకు కనిపిస్తున్న అభివృద్ధిని, అందుతున్న సంక్షేమాన్ని దాచలేరని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు వైసీపీని తిరస్కరించారు.. కూటమి ప్రభుత్వంపై నమ్మకం ఉంచారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే మా లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తుంటే ఓర్వలేకే సాక్షి విష ప్రచారం

**- 160 వెటర్నరీ డాక్టర్ పోస్టుల భర్తీపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం**

**అమరావతి, సెప్టెంబర్ 15:అనంత జనశక్తి న్యూస్**




నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే ఓర్వలేక వైసీపీ, సాక్షి తప్పుడు కథనాలతో నియామక ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క వెటర్నరీ డాక్టర్ పోస్టును కూడా భర్తీ చేయలేదని, కూటమి ప్రభుత్వం 160 పోస్టుల భర్తీకి చర్యలు చేపడితే విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

**ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు చివరి అవకాశం**

ప్రస్తుతం పశుసంవర్ధక శాఖలో సుమారు 300 వెటర్నరీ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం తొలి విడతలో 160 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందన్నారు. తొలుత ఉద్యోగ నియామకాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా పరీక్ష విధానంలో చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు.అయితే గత ఎనిమిదేళ్లుగా నియామకాలు జరగక ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నామని, ఈ ఒక్కసారికి పాత మెరిట్, వెయిటేజీ విధానంలో నియామకాలు చేపట్టాలని వెటర్నరీ నిరుద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని కోరిందన్నారు. అభ్యర్థుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు.

**జీవోలోనే అన్నీ స్పష్టంగా ఉన్నాయి**

2016 అక్టోబర్ 28న జారీ చేసిన జీవో నంబర్ 52 ప్రకారం 100 మార్కులతో మెరిట్, వెయిటేజీ విధానం అమల్లో ఉందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో బీవీఎస్సీ మార్కులకు 60, ఎంవీఎస్సీ అర్హతకు 10, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో కాంట్రాక్టు సేవలకు 10, గ్రాడ్యుయేషన్ పూర్తయినప్పటి నుంచి సీనియారిటీకి గరిష్ఠంగా 20 మార్కులు కేటాయించే విధానం ఉందన్నారు.పాత విధానంలో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కోరగా, ప్రస్తుత పని ఒత్తిడి కారణంగా పరీక్ష లేకుండా వెయిటేజీ ఆధారంగా నియామకాలు చేపట్టేందుకు తగిన సమయం లేదని కమిషన్ తెలిపిందన్నారు. దీంతో జీవో నంబర్ 22 ద్వారా ఈ ఒక్కసారికి మాత్రమే పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాత విధానంలో నియామకాలు చేపట్టాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.

**వాస్తవాలు తెలుసుకోకుండా కథనాలా?**

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ విషయంలోనూ సాక్షి కథనంలో వాస్తవాలు లేవని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం దామోదర్ నాయుడు డైరెక్టర్‌గా లేరని, ఒక మహిళా అధికారి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కనీస వివరాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం జర్నలిజం కాదని అన్నారు.

**ఉద్యోగాలు ఇవ్వడం మా విధానం.. అడ్డుకోవడం వైసీపీ విధానం**

ఎనిమిదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈసారి పాత విధానంలో అవకాశం కల్పిస్తున్నామని, ఇకపై నియామకాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష విధానంలోనే జరుగుతాయని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వడం కూటమి ప్రభుత్వ విధానమని, ఉద్యోగాలకు అడ్డుపడటం వైసీపీ విధానమని విమర్శించారు.యువత భవిష్యత్తుపై రాజకీయాలు చేయవద్దని, తప్పుడు ప్రచారంతో నిరుద్యోగులను నష్టపరచవద్దని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని, ఎన్ని విమర్శలు వచ్చినా నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని మంత్రి స్పష్టం చేశారు.

# రావిరాల జన్నెగూడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలు



**మహేశ్వరం, సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామం జన్నెగూడ క్షేత్రగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వినాయకుని మొదటి రోజు పూజను ఘనంగా నిర్వహించారు.

డెవలప్మెంట్ కమిటీ భక్తుల సహకారంతో ఈ పూజా కార్యక్రమం జరిగింది. విఘ్నేశ్వరుని మొదటి రోజు పూజను ఏర్కలి సహదేవ్ గౌడ్ అర్చన దంపతులు చేయించారు.పూజ చేయించిన దంపతులపై విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని డెవలప్మెంట్ కమిటీ తరపున ఆకాంక్షించారు.ఈ పూజా కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనెమోని శివశంకర్, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పిట్టల శ్రీశైలం, ఉప్పునూతల యాదయ్య, వలోజు లాలయ్య, కాల్వ రమేష్, కందికంటి బాబు సాయి పంతులు అజయ్ తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి: మంత్రి సవితమ్మ




**- ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

**- నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు ఉండకూడదు**

**- నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి మంత్రి సవిత**

**పెనుకొండ సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్**

పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి , సవితమ్మ నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలతో ఇతర అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలు, కాలనీలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, భూగర్భ జలాలు పడిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి తాగునీటి సమస్యను అధిగమించాలని సూచించారు.తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో బోర్లు, నీటి వనరుల పరిస్థితిని పరిశీలించి అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ నీటి వనరులను ఏర్పాటు చేయాలని తెలిపారు. పనిచేయని బోర్లను వెంటనే మరమ్మతులు చేయడంతో పాటు, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ప్రతి మండలంలో తాగునీటి సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు.ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత ఏర్పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు.సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు...

# మద్యం దుకాణాల రెన్యువల్, గెజిట్ విడుదల..

**- ఎక్సైజ్ సి ఐ చంద్రమణి.**

**ధర్మవరం సెప్టెంబర్ 15, అనంత జనశక్తి న్యూస్:**

అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ ప్రసాద్ , జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారి నరసింహులు పుట్టపర్తి వారి ఆదేశాల మేరకు. 18 ఓపెన్ క్యాటగిరి 2 రిజర్వుడ్ కేటగిరిల ధర్మవరము, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మద్యం దుకాణాలు రెన్యువల్ నిమిత్తము గెజిట్ విడుదల చేయడం జరిగిందని ధర్మవరం ఎక్సైజ్ సీఐ ఎన్. చంద్రమణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎక్సైజ్ కార్యాలయంలో లైసెన్సు మద్యం లైసెన్స్ దారులకు సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఓపెన్ క్యాటగిరి, రిజర్వేషన్ కేటగిరి కింద మద్యం దుకాణాల యొక్క రెన్యువల్ ఫీజు, కట్టవలసిన లైసెన్స్ ఫీజు ఇతర వివరాలని వారికి క్షుణ్ణంగా వివరించడం జరిగిందన్నారు. సంవత్సరానికి 2026 27 లైసెన్స్ ఫీజును 4 వాయిదాలలో చెల్లించే అవకాశం ఉంటుంది అని తెలిపారు. పర్మిట్ రూమ్ మొత్తంను 3 వాయిదాలలో చెల్లించవచ్చు అని తెలిపారు . సెప్టెంబర్ నెల 21వ తారీకు సాయంత్రం 05 గంటల లోపల మద్యం దుకాణాల రెన్యూవల్ సరిపడా రుసుమును ప్రభుత్వం వారికి చెల్లించాల్సిందిగా సూచనలు ఇవ్వడం జరిగినది అని తెలిపారు.కాగా రెన్యువల్ కు ముందుకు రాని మద్యం దుకాణాలకు, సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు చెల్లించని వాటికి వారి మద్యం లైసెన్సులు రద్దు చేసి, వాటి స్థానంలో సెప్టెంబర్ నెల 22వ తారీకు నుండి నూతన మద్యం షాపుల టెండర్లకు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు ఈ సమావేశంలో ఎస్సైలు నాగరాజు, చాంద్ బాషా, హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్‌నాయక్, కానిస్టేబుల్లు, మద్యం దుకాణాల వారు పాల్గొన్నారు.



అనంత జనశక్తి
బుధవారం | రంగారెడ్డి
16.09.2026



# ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్‌లో రష్మిక..



ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకురాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. నేడు ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన విడుదలైంది. ఇందులో సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక నటించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'ఎం.ఎస్.సుబ్బులక్ష్మి అమ్మ'పేరుతో ఈ బయోపిక్ రూపొందనుంది.

సుబ్బులక్ష్మి 116వ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 16న ఈ బయోపిక్‌ను ప్రారంభించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. చెన్నై వేదికగా గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అగ్రకథానాయకుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఇక ఈ ప్రతిష్ఠాత్మక సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందించనున్నారు. ఈ బయోపిక్‌లో మొదట సాయిపల్లవి, రుక్మిణీ వసంత్, కీర్తిసురేశ్ పేర్లు వినిపించాయి. చివరికి రష్మికను ఫైనల్ చేశారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్ర కోసం రష్మిక.. ఇప్పటికే లుక్ టెస్ట్ కూడా చేయించుకున్నారు.





# రామ్ చరణ్‌ను అప్పుడు బాగా ఇబ్బంది పెట్టా: శ్రీకాంత్ ఓదెల



'ది ప్యారడైజ్' అంటూ మరో యాక్షన్ సినిమాతో ప్రేక్షకులను పలకరించనున్నారు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. నాని హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో శ్రీకాంత్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. గతంలో తాను రంగస్థలం సినిమా షూటింగ్‌లో రామ్ చరణ్‌ను చాలా ఇబ్బంది పెట్టినట్లు చెప్పారు. "రంగస్థలం' సినిమాకు నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నా. కాస్ట్యూమ్స్, షూటింగ్ సమయంలో చరణ్‌ను చాలా ఇబ్బంది పెట్టాను. తెల్లవారుజామున 3.30కు నిద్రలేపేవాడిని. అయినా ఒక్కమాట కూడా అనలేదు. చిత్రీకరణ పూర్తయిన తర్వాత ఆయన నాకు ప్రత్యేక బహుమతి ఇచ్చారు. ఆ సినిమా మొత్తం ఆయన మెడలో ఉన్న హనుమంతుడి లాకెట్ నాకు ఇచ్చారు. అది చాలా స్పెషల్ ఎందుకంటే.. చిరంజీవి దాన్ని ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి డిజైన్ చేయించారు. చరణ్ నాకు దాన్ని ఇచ్చి 'ఇకపై ఇది నువ్వు వేసుకో' అని అన్నారు. ఆరోజు నుంచి ఇప్పటి వరకూ ఆ లాకెట్ నా మెడలో నుంచి తీయలేదు" అని చెప్పారు.

ఇక 'ది ప్యారడైజ్' గురించి మాట్లాడుతూ.. నాని కెరీర్‌లో ఇప్పటి వరకూ ఇలాంటి భావోద్వేగ సినిమాను చేయలేదని తెలిపారు. భాషతో సంబంధం లేకుండా ప్యారడైజ్‌కు అన్ని ప్రాంతాల్లోనూ క్రేజ్ వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సినిమాలో నాని ఇంట్రో సీన్ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు.

# సమంతకు సీమంతం.. సంప్రదాయాలంటే నాకెల్లప్పుడూ గౌరవమే!





భారతీయ సంప్రదాయాలంటే తనకెప్పుడు గౌరవమేనని అంటున్నారు అగ్ర కథానాయిక సమంత. ప్రస్తుతం ఆమె గర్భిణి అన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సమంతకు 'గోద్ భరాయి' (సీమంత) వేడుకను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను పంచుకుని శ్రీవిద్య ఉపాసనతో కూడిన ఈ వేడుక గురించి సమంత ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘంగా వివరించారు.

"మన సంప్రదాయాలంటే నాకెప్పుడూ గౌరవమే. ప్రతి ఆచారం వెనుక ఉన్న అంతరార్థాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకోకపోవచ్చు, కానీ, వాటి వెనుక ఏదో బలమైన శక్తి, అంతర్లీనమైన అర్థం ఉందని నేనెప్పుడూ నమ్ముతా. మంత్రోచ్ఛారణ ద్వారా వెలువడే శక్తిలో, తరాలుగా ఎంతో శ్రద్ధతో అనుసరిస్తున్న ప్రాచీన ఆచార విధానాల్లో ఆ లోతైన భావం దాగి ఉందని నాకు అనిపిస్తుంది"

"కళావరణం (శ్రీకల్పం) అనేది శ్రీవిద్య సంప్రదాయానికి చెందిన ఒక విశిష్టమైన క్రతువు. శ్రీవిద్య ఉపాసకులు మంత్రోచ్ఛారణ చేస్తూ, పవిత్ర జలంతో గర్భిణి అయిన మహిళకు అభిషేకం చేస్తారు. దీని ద్వారా అమ్మవారి దివ్య గుణాలు ఆ మహిళలో చైతన్యం నింపుతాయని భావిస్తారు. ఈ ప్రక్రియలో నన్నెంతో కదిలించిన విషయం ఏంటంటే, తనలో మరో ప్రాణానికి రూపమిస్తున్న సృష్టికర్తగా తల్లిని గౌరవించడం. ఆమె గర్భంలో పెరుగుతున్న బిడ్డకు ఇదొక ఆశీర్వాదం మాత్రమే కాదు, ఒక కొత్త రూపంలోకి, కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న మహిళకు ఆశీర్వచనమే"

"అభిషేకం తర్వాత తల్లి కాబోతున్న మహిళను శ్రీచక్ర యంత్రంలో కూర్చోబెడతారు. దేవీ ఖడ్గమాల పారాయణ, మంత్ర జపం మనస్సును అంతర్ముఖం చేస్తుంది. ఈ మంత్రోచ్ఛారణ కారణంగా తల్లీ బిడ్డలకు ఒక రక్షణ కవచం ఏర్పడుతుందని నమ్మకం. ఈ అనుభూతి ఎంతో శక్తిమంతంగా అనిపించింది" అని సమంత పేర్కొన్నారు.

భూతశుద్ధి పద్ధతిలో కథానాయిక సమంత, రాజ్ నిడిమోరు ఏడడుగులు వేసిన సంగతి తెలిసిందే. అప్పుడు ఈ వివాహ పద్ధతి బాగా ట్రెండ్ అయింది. ఇక సమంత సీమంతం సందర్భంగా ఆమె భర్త రాజ్ నిడుమోరుఆశీర్వాదం అందించారు. స్నేహితురాలు శిల్ప కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు సామ్ కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు సమంత ఈ వేడుక గురించి పంచుకోగా, మెగా కోడళ్లు ఉపాసన, లావణ్య సహా.. నీరజా కోన, నజ్రియాలు ఆమెకు శుభాకాంక్షలు చెప్పారు.

# వెస్టిండీస్ సిరీస్.. వన్డే జట్టులోకి పంత్, హార్దిక్ పాండ్య!




వెస్టిండీస్ జట్టు త్వరలో భారత్‌లో పర్యటించనుంది. టీమ్ఇండియాతో సెప్టెంబరు 27 నుంచి మూడు వన్డేల సిరీస్, అక్టోబర్ 6 నుంచి ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం జట్లను ఎంపిక చేసేందుకు అజిత్ అగార్కర్ నేతృత్వంలోని భారత సీనియర్ సెలక్షన్ కమిటీ బుధవారం దిల్లీలో సమావేశం కానుంది. ఇప్పటికే ఆసియా క్రీడలకు ఎంపిక చేసిన జట్టునే విండీస్‌తో టీ20లకు కొనసాగించే అవకాశముంది. ఈ వన్డే సిరీస్ సమయంలోనే ఆసియా క్రీడలు జరగనుండటంతో జట్టు ఎంపిక ఎలా ఉంటుందనే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

గాయం నుంచి కోలుకొని ఫిట్‌నెస్ సాధించిన హార్దిక్ పాండ్య ను విండీస్‌తో వన్డేలకు తీసుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఇండియా ఎ, ఆస్ట్రేలియా ఎ మధ్య జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు పాండ్యను ఎంపిక చేశారు. కొంతకాలంగా టెస్టులకు పరిమితమైన రిషబ్ పంత్ వన్డే మళ్లీ వన్డే టీమ్‌లోకి వచ్చే ఆస్కారముంది. ఇషాన్ కిషన్ ఆసియా క్రీడల కోసం జపాన్‌కు వెళ్లనుండటంతో కేఎల్ రాహుల్ కు బ్యాకప్‌గా పంత్‌ను తీసుకోవచ్చు. ఒకవేళ సెలక్టర్లు ధ్రువ్ జురెల్ వైపు మొగ్గుచూపితే ఇరానీ కప్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియాకు పంత్ నాయకత్వం వహిస్తాడు. శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేసి నాలుగో స్థానంలో ఆడించే వీలుంది. ఓపెనింగ్‌లో యశస్వి జైస్వాల్, మిడిల్ ఆర్డర్‌లో రజత్ పటీదార్ రిజర్వ్ ఆటగాళ్లుగా ఉండనున్నారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు కూడా సెలక్టర్ల నుంచి పిలుపొచ్చే అవకాశం ఉంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్.. తొలి భారత ప్లేయర్‌గా శ్రీ చరణి రికార్డు




మహిళల ఆసియా కప్ లో అదరగొట్టిన భారత అమ్మాయిలు ఈ వారం తమ ఐసీసీ ర్యాంకింగ్స్‌ను గణనీయంగా మెరుగుపర్చుకున్నారు. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో నాలుగు వికెట్లు పడగొట్టిన తెలుగమ్మాయి శ్రీ చరణి అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఈ స్పిన్నర్ తన కెరీర్‌లోనే తొలిసారి 800 రేటింగ్ పాయింట్ల మార్క్‌ను దాటి 804 పాయింట్లతో ఉంది. మిథాలీరాజ్ (780.. 2011లో)ను అధిగమించి బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో 800 పాయింట్స్ సాధించిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా శ్రీ చరణి చరిత్ర సృష్టించింది. అంతేకాదు టీ20ల్లో బౌలింగ్ విభాగంలో ఆల్‌టైమ్ అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు సాధించిన

క్రికెటర్లలో శ్రీ చరణి రెండో స్థానానికి చేరుకుంది. మరో మూడు పాయింట్లు సాధిస్తే ఆస్ట్రేలియా క్రికెటర్ మేగన్ షట్ (806.. 2001లో)ను అధిగమించి కొత్త రికార్డు నెలకొల్పే అవకాశం ఉంటుంది

రెండో స్థానానికి దీప్తి శర్మ

ఈ ఆసియా కప్‌లో 14 వికెట్లు పడగొట్టి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన దీప్తి శర్మ (729 పాయింట్లు) నాలుగు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి దూసుకొచ్చింది. 236 రన్స్‌తో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచిన షెఫాలి వర్మ ఒక స్థానం మెరుగై ఆరో ర్యాంకు దక్కించుకుంది. స్మృతి మంధాన 5వ, హర్మన్‌ప్రీత్ కౌర్ 10వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో షెఫాలి (221 పాయింట్లు) ఐదు స్థానాలు ఎగబాకి కెరీర్‌లో బెస్ట్ రేటింగ్ పాయింట్స్ సాధించింది.

# భారత చెస్ ఒలింపియాడ్ టీమ్‌కు చేదు అనుభవం!



ఈ నెల 16 నుంచి ఉజ్బెకిస్థాన్ వేదికగా ఫిడే చెస్ ఒలింపియాడ్ ప్రారంభం కానుంది. ఇందులో పాల్గొనేందుకు ఆ దేశంలోని సమర్‌కండ్‌కు చేరుకున్న భారత టీమ్‌కు చేదు అనుభవం ఎదురైనట్లు సమాచారం. భారత బృందం ఐదు గంటలకు పైగా ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయిందని.. ఆటగాళ్లు, సహాయక సిబ్బందికి బసకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదని గ్రాండ్‌మాస్టర్ శ్రీనాథ్ నారాయణన్ తెలిపారు. "ఫిడే చెస్ ఒలింపియాడ్‌లో దారుణమైన అనుభవం ఎదుర్కొంటున్నాం. భారత జట్టు సభ్యులు సమర్‌కండ్ విమానాశ్రయానికి చేరుకుని 5 గంటలు దాటింది. ఇప్పటికీ గదులు కేటాయించలేదు. ఎప్పుడు కేటాయిస్తారనే దానిపైనా ఎలాంటి స్పష్టత లేదు" అని శ్రీనాథ్ నారాయణన్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. దీనిపై భారత యువ చెస్ స్టార్ విదిత్ గుజరాతీ స్పందించాడు. ఉజ్బెకిస్థాన్‌లో తమ వసతి ఏర్పాట్లు ఇంకా ఖరారు కావాల్సి ఉందన్నాడు. భారత్ తరఫున గుకేశ్, ప్రజ్ఞానంద, కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్, విదిత్ గుజరాతీ, అర్జున్ ఇరిగేశీ తదితరులు ఈ చెస్ ఒలింపియాడ్‌లో ఆడనున్నారు. ఓపెన్, మహిళల విభాగాల్లో కలిపి మొత్తం 400 జట్లు పోటీ పడుతున్నాయి. ఇందులో ఓపెన్ విభాగంలో 208 జట్లు, మహిళల విభాగంలో 192 జట్లు ఉన్నాయి.

# దులీప్ ట్రోఫీ ఫైనల్ నిరాశపరిచింది.. 20 వికెట్లు తీయలేకపోతే ఎలా?: గావస్కర్

అంతర్జాతీయ క్రికెటర్లు దులీప్ ట్రోఫీలో ఆడటంతో దేశవాళీ టోర్నీకి కళ వచ్చింది. ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే, ఈ ఫైనల్ తనను తీవ్రంగా నిరాశపరిచిందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించారు. తొలి ఇన్నింగ్స్ లీడ్ కారణంగా విజేతగా నిలవడం కంటే ప్రత్యర్థి జట్టును రెండుసార్లు ఆలౌట్ చేసి ఉంటే బాగుండేదని సూచించారు.

"ఫైనల్‌లో ఈస్ట్ జోన్ విజయం కోసం ఇలాంటి సురక్షితమైన మార్గాన్ని ఎంచుకోవడం బాగోలేదు. అవసరం లేకుండా రెండోసారి బ్యాటింగ్ చేసినట్లు అనిపించింది. ఇక షెడ్యూల్ కంటే ముందే ఇద్దరు కెప్టెన్లు ఓ అంగీకారానికి వచ్చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన ఆధిక్యమే సరిపోతుంది. కానీ, ఈస్ట్ జోన్ ఆ దిశగా ప్రయత్నించలేదు. అందుకే, అంతర్జాతీయంగానూ 20 వికెట్లను తీయడంలో మన జట్టు ఇబ్బంది పడుతోంది. ఇక్కడ ప్రాక్టీస్ చేస్తేనే కదా ఆ వేదికపై రాణించేందుకు అవకాశం ఉంటుంది. దేశవాళీ మ్యాచ్‌లోనే 20 వికెట్లు తీయలేకపోతే ఎలా? శ్రీలంకతో రెండో టెస్టును చూడండి. చివరి నాలుగు వికెట్లను త్వరగా తీయలేక విజయాన్ని దూరం చేసుకున్నాం. బ్యాటర్లు ఎలాగైతే హాఫ్ సెంచరీలను సెంచరీలుగా మలచడం నేర్చుకుంటారో.. బౌలర్లూ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పదేసి వికెట్లు తీయడం అలవాటు చేసుకోవాలి. ఫస్ట్ క్లాస్ మ్యాచులను ఆడటం వల్ల వీటన్నింటినీ నేర్చుకొనేందుకు అవకాశం వస్తుంది" అని గావస్కర్ వెల్లడించారు..

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఏమైందంటే?

సౌత్ జోన్‌తో ఫైనల్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ జోన్ 708 పరుగులు చేసింది. అనంతరం సౌత్ జోన్ 338 పరుగులకే ఆలౌటైంది. దీంతో ఇషాన్ కిషన్ నాయకత్వంలోని ఈస్ట్ జోన్‌కు 372 పరుగుల లీడ్ దొరికింది. కానీ, సౌత్ జోన్‌కు ఫాలో ఆన్ ఇవ్వకుండా ఇషాన్ కిషన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్ చేయాలని నిర్ణయించాడు. ఐదో రోజు మధ్యాహ్నానికి 338/7 స్కోరు చేసింది. దీంతో ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో కెప్టెన్లు తిలక్ వర్మ, ఇషాన్ కిషన్‌లు డ్రాకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్ లీడ్ కారణంగా ఈస్ట్ జోన్ కప్పును సొంతం చేసుకుంది. 13 ఏళ్ల తర్వాత ఆ జట్టు దులీప్ ట్రోఫీని నెగ్గింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945